www.vaarthavedhikasurya.com

RNI NO: TGTEL/25/A0305

SCAN ME

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

యాదాద్రి భువనగిరి | బుధవారం 19, నవంబర్ 2025 | ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి | సంపుటి : 01 | సంచిక: 181 | పేజీలు: 08 | వెల: 5/-

## మావో మాస్టర్‌మైండ్

# హిడ్మా హతం

- అడవుల్లో చిక్కిన మావో అగ్రనేత హిడ్మా
- ఆయన భార్య కూడా హతం
- న్యూ ఆటోనగర్‌లో 28 మంది, రామవరప్పాడులో నలుగురు మావోయిస్టుల పట్టివేత
- 20 రోజులుగా తలదాచుకుంటున్నట్టు సమాచారం
- ఇంటెలిజెన్స్ అదనపు డీజీ మహేశ్ చంద్ర లడ్డా



హిడ్మా (ఫైల్ ఫోటో)



హైదరాబాద్,నవంబరు 18 (వార్త వేదిక సూర్య): ఇటీవలి కాలంలో ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో చావు దెబ్బ తింటున్న మావోయిస్టు పార్టీకి తాజాగా మరో చావుదెబ్బ తగిలింది. గెరిల్లా యుద్ధంతోపాటు, మెరుపు దాడులు, మెరుపు వ్యూహాలు రచించే మాస్టర్‌మైండ్ హిడ్మాను. ఏపీ ఎస్ఐబి ఆయన భార్యతో సహా మట్టు పెట్టింది. వారితోపాటు మరో ఆరుగురు మావోలు మృతి చెందారు. తాజా ఎన్‌కౌంటర్ మావోయిస్టు పార్టీకి వజ్రా ఘాతమే. నిజానికి హిడ్మా కదలికలపై గత కొద్దిరోజుల నుంచి.. సీక్రెట్ ఆపరేషన్ చేస్తున్న ఎస్ఐబి అధికారులు, చాపకింద నీరులా ఆపరేషన్ నిర్వహించి, లక్ష్యం సాధించారు.మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో ఆంధ్రప్రదేశ్-ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లో భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య భీకరమైన ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో హిడ్మా మరణించాడు. ఘటనా స్థలం నుంచి ఆయుధాలు, కీలకమైన మావోయిస్టు డాక్యుమెంట్లను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి.ఆపరేషన్‌లో ఆరుగురు మావోయిస్టులు మరణించారు. వీరిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా భార్య రాజే కూడా ఉన్నారు.

విజయవాడ, కాకినాడ ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో మావోయిస్టులను అరెస్ట్ చేసినట్లు ఇంటెలిజెన్స్ అదనపు డీజీ మహేశ్ చంద్ర లడ్డా వెల్లడించారు.కృష్ణా జిల్లా, విజయవాడ, కాకినాడ ప్రాంతాల్లో కలిపి మొత్తం 31 మంది మావోయిస్టులను అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. గత నెల రోజులుగా వీరి కదలికలపై నిఘా పెట్టినట్లు ఆయన వెల్లడించారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాతోపాటు పలువురు మావోయిస్టులు మృతి చెందారని అల్లూరు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్



వెల్లడించారు. మంగళవారం ఉదయం 6.30 నుంచి 7.30 గంటల మధ్య ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని తెలిపారు.

మరో ఐదుగురు మావోయిస్టులు ఘటనా స్థలం నుంచి తప్పించుకున్నారన్నారు. వారి కోసం కూంబింగ్ కొనసాగుతోందని చెప్పారు. మరణించిన మావోయిస్టు అగ్రనేత హిడ్మా 28 హింసాత్మక సంఘటనల్లో పాల్గొన్నారని వివరించారు. అతడిపై అనేక రివార్డులు ఉన్నాయని గుర్తు చేశారు. హిడ్మా కదలికలపై గత మూడు వారాలు నుంచే సమాచారం ఉందన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులపై పోలీసులు ఉక్కు పాదం మోపటం వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లి అటవీ ప్రాంతానికి వారు చేరుకున్నారన్నారు. మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు. ఇప్పటికే మృతి చెందిన మావోయిస్టుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని చెప్పారు.

మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత హిడ్మాతోపాటు అతడి అనుచరులు మరణించారని విశాఖ రేంజ్ డీఐజీ గోపి నాథ్ జెట్టి ధృవీకరించారు. మావోయిస్టులపై ఇతర రాష్ట్రాల్లో పోలీస్ నిఘా అధికంగా ఉండడంతో అగ్రనేత లంతా ఏవోబీలోకి ప్రవేశిస్తున్నారని వివరించారు. విశాఖ రేంజ్‌లో మావోయిస్టులకు ఆశ్రయం పొందేందుకు వీలు లేదన్నారు.

### విజయవాడలో చిక్కిన 28 మంది మావోయిస్టులు

విజయవాడ శివారు న్యూ ఆటోనగర్‌లో పోలీసులకు చిక్కిన 28 మందిలో మావోయిస్టు పార్టీకి చెందిన కీలక సభ్యులు ఉన్నట్లు ఎస్ఐబీ అధికారులు గుర్తించారు. న్యూ ఆటోనగర్‌లోని ఆటో మొబైల్ పరిశ్రమలో వివిధ రాష్ట్రాలకు చెందిన వారు పని చేస్తున్నారు. వీరిలో అధిక శాతం మంది ఒడిశా, ఛత్తీస్ గఢ్, జారండ్‌కు చెందిన వారు ఉన్నారు.

వారిలో ఆ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్ జికి రక్షణగా ఉన్న 9 మంది సుశిక్షితులైన కమాండోలు ఉన్నారని.. దేవ్ జికి రక్షణ దళం కమాండర్ జ్యోతి సైతం, విజయవాడ షెల్టర్ జోన్‌లో దొరికిన వారిలో ఒకరని అధికారులు వెల్లడించారు. మిగతా 19 మంది కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాకు రక్షణగా ఉన్న ఫ్లటూన్ సభ్యులని ఎస్ఐబీ అధికారులు వెల్లడించారు.

### ఏలూరు,కాకినాడ జిల్లాలోనూ..

కాకినాడ జిల్లాలోనూ ఇద్దరు మావోయిస్టులను పోలీసులు అదుపులోకి

మిగతా 2లో..



## కోటి మంది మహిళలకు

# కోటి చీరలు

- అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీర
- రేపు ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా పంపిణీ ప్రారంభం
- ఇందిరమ్మ చీరలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్,నవంబరు 18 (వార్త వేదిక సూర్య): కోటి మంది మహిళలకు కోటి చీరలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందిరమ్మ చీరలకు సంబంధించి మంగళవారం మంత్రి సీతక్కతో కలిసి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరను అందించాలని అధికారులకు సూచించారు.

బుధవారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ చీరల పంపిణీని ప్రారంభించనున్నారు. చీరలను పూర్తిగా సిరిసిల్ల చేనేత కార్మికులు తయారు చేస్తున్నారు. ఉత్పత్తి ఆలస్యం అవుతున్న నేపథ్యంలో ఉత్పత్తికి అనుగుణంగా రెండు దశలుగా చీరల పంపిణీ చేపట్టాలని సీఎం అధికారులకు సూచించారు. తొలి దశలో గ్రామీణ ప్రాంతాల్లో చీరలను పంపిణీ చేయాలని నిర్ణయించారు.

ఇందిరా గాంధీ జయంతి నుంచి డిసెంబరు 9 తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం వరకు గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. రెండవ దశలో పట్టణ ప్రాంతాల్లో మార్చి 1నుంచి మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో చీరల నాణ్యత

మిగతా 2లో..

## సింగపూర్, టోక్యో, న్యూయార్క్

## నగరాలతో మా పోటీ

- రాబోయే ఏడాదిలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు
- డిసెంబర్ 9న తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల
- రాష్ట్రంలో డ్రై పోర్టు ఏర్పాటు ప్రణాళికలు
- హైదరాబాద్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలి
- అర్బన్ డెవలప్మెంట్ మినిస్టర్స్ రీజనల్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో..



## ఢిల్లీపై ఇజ్రాయిల్ తరహా

# దాడి?

- ఢిల్లీ కారుబాంబు పేలుళ్లతో తప్పిన పెను ప్రమాదం
- పోలీసులు తీగ లాగుతుంటే కదులుతున్న కుట్రల డొంకలు

న్యూఢిల్లీ,(వార్త వేదిక సూర్య): వామ్మో.. ఢిల్లీ బ్లాస్ట్ దర్యాప్తులో ఒళ్లు గగుర్పొడిచే సంగతులు వెలుగులోకి వస్తున్నాయి. నిన్నామొన్నటిదాకా దేశ వ్యాప్తంగా కారు




బ్లాస్ట్‌లకు డాక్టర్ల బృందం ప్రణాళికలు రచించినట్లుగా అనుకున్నారు. కానీ తాజాగా జమ్మూ కాశ్మీర్ నివాసి జాసిర్ బిలాల్ వాని అలియాస్ డానిష్‌ను అరెస్టు చేశాక.. అంతకు మించిన కుట్ర జరిగినట్లుగా దర్యాప్తులో తేలింది.

అక్టోబర్ 7, 2023.. ఈ తేదీ గుర్తుందా? మరిచిపోయే డేట్ కాదు. ఇజ్రాయెల్ చరిత్రలో చీకటి రోజు. హమాస్ ఉగ్రవాదులు ఒక్కసారిగా డ్రోన్లు, రాకెట్లతో ఇజ్రాయెల్‌పై విరుచుకుపడ్డారు. వందలాది మంది ఇజ్రాయెల్ పౌరులు ప్రాణాలు కోల్పోగా.. 250 మందికి పైగా బందీలుగా తీసుకెళ్లిపోయారు. ఈ విషయం అందరికీ గుర్తుండే ఉంటుంది. సేమ్ ఇదే తరహాలో ఉగ్ర డాక్టర్ల బృందం కూడా భారత్‌పై విరుచుకుపడాలని కుట్ర పన్నినట్లుగా దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఈ మేరకు డానిష్ అరెస్ట్ తర్వాత ఈ కొత్త కుట్ర కోణం వెలుగులోకి వచ్చింది.

డానిష్.. జమ్మూకాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలోని ఖాజీగుండ్ నివాసి. శ్రీనగర్‌లో ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. ఇతడు డ్రోన్ నిపుణుడిగా గుర్తించారు. డ్రోన్ల ద్వారా అత్యంత శక్తివంతమైన బాంబు పేలుళ్లకు కుట్ర పన్నాడు. డాక్టర్ ఉమర్‌తో కలిసి ఈ ప్రణాళిక రచించాడు. టెర్రర్ మాడ్యూల్‌లో డానిష్ కూడా ఒక కుట్రదారుడు. ఇతడు డ్రోన్లు, రాకెట్ల ద్వారా ఎలా శక్తివంతమైన బాంబులు పేల్చవచ్చో.. అందుకు సంబంధించిన సాంకేతిక సహాయాన్ని డానిష్ అందించాడు.

ఆర్డీఎక్స్ బరువైన బాంబులను

మిగతా 2లో..

## టి సాట్ ద్వారా పోటీ పరీక్షలకు

# అవసరమైన కంటెంట్

- టి-సాట్ నెట్వర్క్ కంటెంట్ అన్ని స్థాయిల్లో ఉపయోగం
- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్,నవంబర్18(వార్తా వేదిక సూర్య): పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు నాణ్యమైన కంటెంట్ అందిస్తున్న టి- సాట్ ను రాష్ట్ర ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అభినందించారు. ఉపాధ్యాయ ఉద్యోగ పరీక్ష డీఎస్సీకి టెట్ అర్హత తప్పనిసరి కావడంతో అభ్యర్థులందరూ టి-సాట్ డిజిటల్ కంటెంట్ ద్వార సంసిద్ధులు కావాలని సూచించారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం ఉపాధ్యాయ అర్హత పరీక్షలను ప్రతీ ఏటా రెండు సీజన్లలో నిర్వహిస్తుండగా నిత్యం అందుబాటులో ఉండే టి-సాట్ నెట్వర్క్ కంటెంట్ అన్ని స్థాయిల్లో అభ్యర్థులకు ఉపయోగ పడుతుందని మంత్రి గుర్తుచేశారు. టి-సాట్ టీజీ టెట్-2026 డిజిటల్




కోచింగ్ పోస్టర్ ను సచివాలయంలో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల కాలంలో మూడు టెట్ పరీక్షలు నిర్వహించిన ప్రభుత్వం, 2026 జనవరి నెలలో నిర్వహించే టెట్-2026 పరీక్ష కోసం

మిగతా 2లో..

## పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుకు

# మేం వ్యతిరేకం

- ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దు
- ఆల్మట్టి ఎత్తు పెంచితే తెలంగాణకు అన్యాయం.. కర్ణాటకను ఆపండి..
- జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో మంత్రి ఉత్తమ్ భేటీ.. కీలక అంశాలపై విజ్ఞప్తులు.

న్యూఢిల్లీ,నవంబరు 18 (వార్త వేదిక సూర్య): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్లాన్ చేస్తున్న పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు తాము వ్యతిరేకమని.. ఈ ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వొద్దని.. తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను కోరారు. ఢిల్లీలో కేంద్రమంత్రితో భేటీ అయిన ఉత్తమ్ కుమార్.. విలేఖరులతో మాట్లాడారు.

### 45 టీఎంసీలు వెంటనే కేటాయించండి

'కొంత కాలం నుంచి జల్ శక్తి మినిస్ట్రీలో తెలంగాణకు చెందిన అంశాలు పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్రమంత్రిగా చొరవ చూపి వాటిని త్వరగా పరిష్కరించాలని కోరాం. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు మొత్తం 90 టీఎంసీల నీటి కేటాయింపు అడిగాం. వాటిల్లో 45 టీఎంసీల నీటిని వెంటనే పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు కేటాయించాలని అడిగాం. ఈ సమావేశంలో కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌తో

మిగతా 2లో..

## 6వ జాతీయ జల అవార్డులలో తెలంగాణకు అవార్డుల పంట

- జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో దేశంలోనే తెలంగాణ టాప్
- తెలంగాణ అధికారులకు పురస్కారాలు ప్రదానం చేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- ఆదిలాబాద్, నల్గొండ, మంచిర్యాల జిల్లాలకు వరుసగా 3 ర్యాంకులు..

న్యూఢిల్లీ,(వార్త వేదిక సూర్య): జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం టాప్‌లో నిలిచింది. కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన 6వ జాతీయ జల అవార్డులు-2024లో.. తెలంగాణ జాతీయ స్థాయిలో తొలి ర్యాంకును సాధించింది. కేంద్ర ప్రభుత్వం 2024లో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. తెలంగాణ మొత్తం 5,20,362 పనులు పూర్తిచేసింది. జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్రాలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇవాళ (నవంబర్-18న) పురస్కారాలు ప్రదానం చేశారు. జల్ సంచయ్ జన్ భాగీదారీని ఉత్తమంగా అమలు చేసిన రాష్ట్రాలు, జిల్లాలు, స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం 100 అవార్డులను ప్రకటించింది. ఇందులో



మూడు రాష్ట్రాలు, 67 జిల్లాలు, 6 మున్సిపల్ కార్పొరేషన్లు, ఒక పట్టణ స్థానిక సంస్థ, రెండు భాగస్వామ్య మంత్రిత్వ శాఖలు/విభాగాలు, రెండు పరిశ్రమలు, మూడు ఎన్‌జీఓలు, ఇద్దరు దాతలు, 14 మంది నోడల్ అధికారులు ఉన్నారు.

క్షేత్రస్థాయిలో జల సంరక్షణలో ప్రజలు, సంఘాలు, కార్పొరేట్ సంస్థలను భాగస్వాములను చేసే లక్ష్యంతో

మిగతా 2లో..



## సర్,ఓట్ చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరు

### ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో డిసెంబర్‌లో ర్యాలీ

### మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన కాంగ్రెస్ భేటీలో నిర్ణయం

న్యూఢిల్లీ,నవంబర్18(వార్తా వేదిక సూర్య): ఎస్ఐఆర్,ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో డిసెంబర్ ప్రథమార్ధంలో ర్యాలీ నిర్వహించాలని కూడా కాంగ్రెస్ నిర్ణయించింది. ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ పక్రియ ప్రస్తుతం కొనసాగుతున్న రాష్టాల్రు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల

మిగతా 2లో..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

# కోటి మంది మహిళలకు కోటి చీరలు

మొదటి పేజీ తరువాయి..

విషయంలో రాజీపడొద్దని, మహిళలకు నాణ్యమైన చీరలను అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

సాంకేతికను వినియోగించుకుని ఇందిరమ్మ చీరల పంపిణీ పారదర్శకంగా జరిగేలా చూడాలని, పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. బుధవారం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా మధ్యాహ్నం 12 గంటలకు నెక్లెస్ రోడ్ లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన అనంతరం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంబి,స్తారు. అనంతరం సెక్రటేరియట్ నుంచి గ్రామీణ ప్రాంత మహిళలతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి మాట్లాడతారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందుబాటులో ఉన్న కలెక్టరేట్ల నుంచి వీడియోకాన్ఫరెన్స్ లో పాల్గొనాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క, సీఎం సెక్రెటరీ మాణిక్ రాజ్, ప్రిన్సిపల్ సెక్రెటరీ హ్యాండ్లూమ్స్ శైలజా రామయ్యర్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్, సెర్ప్ సీఈవో డి.దివ్య, తదితరులు పాల్గొన్నారు.




## సింగపూర్, టోక్యో, న్యూయార్క్ నగరాలతో మా పోటీ

**రాబోయే ఏడాదిలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులు**

**డిసెంబర్ 9 న తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల**

**రాష్ట్రంలో డ్రై పోర్టు ఏర్పాటు ప్రణాళికలు**

**హైదరాబాద్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలి**

**అర్బన్ డెవలప్మెంట్ మినిస్టర్స్ రీజనల్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హాజరైన కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, ఏపీ మంత్రి పొంగూరు నారాయణ, గుజరాత్ మంత్రి కనుభాయ్ మోహన్ లాల్ దేశాయ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు.**

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య): ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశం భారతదేశం. వికసిత్ భారత్ 2047 అనుగుణంగా 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా దేశాన్ని తీర్చిదిద్దాలని ప్రధాని మోదీ పనిచేస్తున్నారు. హైదరాబాద్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌ని కోరుతున్నా. వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన అనుమతులు వేగంగా జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్న. మెట్రో విస్తరణ, రీజనల్ రింగ్, గోదావరి జలాల తరలింపు, మూసీ ప్రక్షాళనతో పాటు వివిధ అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వ సహకారం ఉండాలి. రాబోయే ఏడాదిలో 3 వేల ఎలక్ట్రిక్ బస్సులను హైదరాబాద్ నగరంలో తీసుకురావాలని ప్రణాళికలు వేస్తున్నాం.

డిసెంబర్ 9 న తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ విడుదల చేయబోతున్నాం. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్స్ ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తున్నాం. దేశ ఎకానమీలో 10 శాతం ఎకానమీని తెలంగాణ నుంచి అందించాలని భావిస్తున్నాం. హైదరాబాద్ నగర అభివృద్ధితోపాటు మేం భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయబోతున్నాం. రాష్ట్రంలో డ్రై పోర్టు ఏర్పాటు చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నాం. మా పోటీ ఇతర రాష్ట్రాల నగరాలతో కాదు.. మా పోటీ సింగపూర్, టోక్యో, న్యూయార్క్ నగరాలతో. ఇందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం.

## ఢిల్లీపై ఇజ్రాయిల్ తరహా దాడి?

(మొదటి పేజీ తరువాయి)

మోయగలిగే పెద్ద బ్యాటరీలతో అమర్చబడిన డ్రోన్లు తయారు చేసినట్లుగా దర్యాప్తు అధికారులు గుర్తిం చారు. గతంలో చిన్న ఆయుధాలను తీసుకెళ్లే డ్రోన్లను డానిష్ తయారు చేశాడు. తాజాగా పెద్ద ఎత్తున బాంబులు తీసుకెళ్లే డ్రోన్లను తయారు చేస్తున్నడు. ఈ డ్రోన్ టార్గెట్ రద్దీగా ఉన్న ప్రాంతంలో ప్రయోగించడమే. హమాస్ ఉగ్రవాదులు కూడా ఇజ్రాయెల్‌పై ఇదే తరహాలో ప్రయోగించారు.

అలాగే సిరియాలో కూడా ఇతర సంస్థలు కూడా ఇలానే ప్రయో గించాయి. సేమ్.. అదే తరహాలో డిసెంబర్ 6న బాబ్రీ మసీద్ కూల్చివేత వార్షికోత్సవం సందర్భంగా దాడులు చేయాలని డానిష్, ఉమర్ కుట్ర పన్నినట్లుగా దర్యాప్తు సంస్థలు కనిపెట్టాయి.డ్రోన్ కుట్రలో భాగంగా గతేడాది అక్టోబర్‌లో కుల్గామ్‌లోని ఒక మసీదులో డానిష్-ఉమర్ కలిసినట్లుగా గుర్తించారు. అక్కడ నుంచి ఫరీదాబాద్‌లోని అల్-ఫలాహ్ విశ్వవిద్యాలయానికి తన వసతి గృహానికి ఉమర్ తీసుకెళ్లాడు. ఇక్కడే ఉమర్‌ను.. అతని బృందాన్ని డానిష్ ఉగ్రవాదంపై బాగా మైండ్ వాష్ చేసినట్లుగా తెలుస్తోంది.

నిషేధిత జైష్-ఎ-మొహమ్మద్ (JeM) కోసం ఓవర్-గ్రౌండ్ వర్కర్ (OGW)గా పనిచేయాలని కోరాడు. ఇక ఉమర్‌ను అయితే ఆత్మాహుతి మిషన్ నిర్వహించాలని డానిష్ ప్రేరేపించాడు. అయితే ఇస్లాం ప్రకారం ఆత్మహత్య నేరం అంటూ ఆ ప్రణాళిక నుంచి ఉమర్ వైదొలిగాడు. దీంతో డ్రోన్ నిర్వహణలో సాంకేతిక నిపుణుడు కాబట్టి ఆ దిశగా ఉమర్‌ను డానిష్ పురికొల్పాడు. జేఎం సహాయంతో ఆర్థిక వనరులు కూడా కూడబెట్టాడు.

డిసెంబర్ 6 కోసం ప్రణాళిక రచించుకుంటూ ఉండగా ఇంతలో సన్నిహితుడు డాక్టర్ ముజిమ్మిల్ అరెస్ట్ అయ్యాడు. దీంతో ఉమర్ భయాందోళనకు గురయ్యాడు. అయితే కారులో సరిగ్గా అమర్చలేని ఐఈడీ బాంబ్ ఒక్కసారిగా ఎర్రకోట దగ్గర పేలిపోయింది. ఈ ఘటనలో 13 మంది చనిపోయారు. ఈ కారు బ్లాస్ట్‌తో మొత్తం దేశ వ్యాప్తంగా డాక్టర్ల బృందం రచించిన ఉగ్ర కుట్ర బయటపడింది. నవంబర్ 10న ఢిల్లీ కారు బ్లాస్ట్ జరిగి ఉండకపోతే మాత్రం డిసెంబర్ 6న దేశ వ్యాప్తంగా మారణహోమమే జరిగి ఉండేదని దర్యాప్తు సంస్థలు భావిస్తున్నాయి. పెద్ద ఎత్తున హమాస్ ఉగ్రవాదుల తరహాలో దేశంలో బాంబ్ దాడులు జరిగేవని అధికారులు పేర్కొన్నారు. పెద్ద వినాశనం తప్పినట్లుగా అధికారులు భావిస్తున్నారు.

## టి సాట్ ద్వారా పోటీ పరీక్షలకు అవసరమైన కంటెంట్

(మొదటి పేజీ తరువాయి)

టి-సాట్ నెట్వర్క్ స్పెషల్ డిజిటల్ కంటెంట్ అందిస్తోందని టి-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి విద్యాశాఖకు

మెరుగైన వసతుల్ని కల్పిస్తున్నారని, 11వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు రికార్డు కాలంలో పూర్తి చేసారన్నారు. కేంద్ర గైడ్ లైన్స్ ప్రకారం టెట్ అర్హత ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడికీ తప్పనిసరి అయిన నేపథ్యంలో టెట్ కు హాజరయ్యే అభ్యర్థులతో పాటు ఉపాధ్యాయుల కోసం సైతం ప్రత్యేక కంటెంట్ అందిస్తున్నామని సీఈవో బోధనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన పరీక్షల తేదీలను అనుసరించి టెట్ పరీక్షలకు నవంబర్ 18,19వ తేదీలు మంగళ, బుధవారాల్లో లైవ్ ఓరియంటేషన్ తో పాటు మరో 44 రోజులు 200 ఎపిసోడ్స్ ప్రసారం చేయనున్నట్లు సీఈవో తెలిపారు. టి-సాట్ నిపుణ ఛానల్ లో సాయంత్రం 5గంటల నుండి ఏడు గంటల వరకు, విద్య ఛానల్లో ఉదయం ఐదు గంటల నుండి ఏడు గంటల వరకు ప్రతి రోజు నాలుగు గంటల పాటు ప్రత్యేక ప్రసారాలుంటాయని సీఈవో ప్రకటించారు. టీచర్స్ ఎలిజబిలిటీ టెస్ట్ కు అవసరమైన స్జబెక్టులు చైల్డ్ డెవలప్మెంట్, సైకాలజీ, పిజికల్, బయాలాజికల్ సైన్స్, మాథ్స్, సోషల్ స్టడీస్ తో పాటు ఇంగ్లీష్, తెలుగు ఇతర స్జబెక్టులకు సంబంధించిన డిజిటల్ లెసన్స్ ప్రసారమౌతాయన్నారు. టెట్ పేపర్-1, 2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు టి-సాట్ అందించే ప్రసారాలను సద్వినియోగం చేసుకోవాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి కోరారు. టెట్ అర్హత పరీక్ష కోసం టి-సాట్ నెట్వర్క్ ప్రసారం చేసే ప్రత్యేక కంటెంట్ టి-సాట్ శాటిలైట్ ఛానళ్లతో పాటు, టి-సాట్ యాప్, యూట్యూట్ లో అందుబాటులో ఉంటాయన్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో టి-సాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాధిక్ పాల్గొన్నారు.



## పెళ్లి ఆహ్వాన పత్రిక అందచేసిన రాహుల్ సిప్లిగంజ్

హైదరాబాద్,(వార్తా వేదిక సూర్య): ప్రముఖ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ పెళ్లి ఈ నెల 27న జరుగనుంది. ఈ మేరకు కాబోయే భార్యతో కలసి ఆయన సిఎం రేవంత్‌ను కలిసి పత్రిక అందచేశారు. తన పెళ్లికి రావాలని ఆహ్వానించారు. అందుకు సిఎం సానుకూలంగా స్పందించారు.

# మావో మాస్టర్‌మైండ్ హిడ్మా హతం

మొదటి పేజీ తరువాయి..

తీసుకున్నారు. మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో దొరికిన డైరీ ఆధారంగా












వీరిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు చెబుతున్నారు.ఏలూరులోనూ మావోయిస్టుల కలకలం రేగింది. ఏలూరు గ్రీన్ సిటీలో తలదాచుకున్న మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో అక్కడకు చేరుకున్న పోలీసులు, దాదాపు 15 మంది మావోలను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వీరిలో ఐదుగురు మహిళలు ఉన్నట్లు తెలుస్తోంది.

గ్రీన్ సిటీలోని ఒక ఇంటిలో గత వారం రోజులుగా మావోలు తలదాచుకున్నట్లు సమాచారం.

# పోలవరం- బనకచర్ల ప్రాజెక్టుకు మేం వ్యతిరేకం

మొదటి పేజీ తరువాయి..

సహా.. సీడబ్ల్యూసీ ఛైర్మన్ కూడా ఉన్నారు. వారికీ కూడా ఇదే విషయాన్ని చెప్పాం. ఈ అంశం మీ దగ్గరే చాలా రోజుల నుంచి పెండింగ్‌లో ఉందని చెప్పాం. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు మొదటి 45 టీఎంసీల నీటిని వెంటనే కేటాయించాలని ఈరోజు కూడా రెక్వెస్ట్ చేయడం జరిగింది' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

### సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు క్లియరెన్స్ ఇవ్వండి..

'గోదావరి జలాల్లో.. సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను సబ్మిట్ చేశాం. సీడబ్ల్యూసీకి అనేక సందర్భాల్లో వారు అడిగిన వివరాలు ఇచ్చాం. ఇప్పటికే చాలా సమయం గడిచిపోయింది. వీలైనంత తొందరగా ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని క్లియరెన్స్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశాం. దాని పూర్తి వివరాలు మళ్లీ సమర్పించాం. బ్రిజేష్ ట్రిబ్యునల్ (కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్-2) ఏపీ-తెలంగాణ మధ్య 811 టీఎంసీలను ఇరు రాష్ట్రాలకు డివైడ్ చేయాలి. దీనికి సంబంధించిన ప్రొసీడింగ్స్ కూడా చాలా స్లోగా వెళ్తున్నాయి. ఈ విషయంలో కేంద్రప్రభుత్వం చొరవ చూపి.. జస్టిస్ బ్రిజేష్‌ను రిక్వెస్ట్ చేసి ఈ ప్రొసీడింగ్స్‌ను వేగవంతంగా ఫైనలైజేషన్ చేయించాలని కోరాం' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.

### పోలవరం-బనకచర్లకు మేము వ్యతిరేకం..

'ఆంధ్రప్రదేశ్ పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు సంబంధించి ప్రీ ఫీజుబులిటీ రిపోర్ట్‌ను సబ్మిట్ చేసింది. దాన్ని మేము వ్యతిరేకించాం. అది చాలా స్పష్టంగా గోదావరి వాటర్ డిస్ప్యూట్ 1980 అవార్డులో ఫ్లడ్ వాటర్ కేటాయించడానికి ఎవరికీ ఎటువంటి ఆస్కారం లేదనే విషయాన్ని అప్పుడు కూడా పాయింటవుట్ చేశాం. ఇప్పుడు ఏపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్ట టర్మినల్ ఫేజ్ మార్చి, ప్రాజెక్ట పేరు మార్చి.. తిరిగి గోదావరి ఫ్లడ్ వాటర్ స్పేర్‌పై మరొకసారి కేంద్రానికి వస్తున్న సందర్భంగా.. మేము దీనికి కూడా వ్యతిరేకం అని చెప్పాం.

స్పష్టంగా, లిఖితపూర్వకంగా కేంద్రమంత్రికి వివరించాం. ఈ ప్రాజెక్ట ఇల్లీగల్ అని స్పష్టంగా చెప్పాం. ఈ ప్రాజెక్టును మహారాష్ట్ర, కర్ణాటక కూడా వ్యతిరేకిస్తున్నాయి. ఆ రాష్ట్రాలు ఎందుకు వ్యతిరేకిస్తు న్నాయో కేంద్రమంత్రికి తెలియజేశాం. దీనికి కేంద్ర ప్రభుత్వం అనుమతులు ఇవ్వొద్దని చెప్పాం' అని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

### ఆల్మట్టి ఎత్తు పెంచొద్దు.. ఆదేశాలు ఇవ్వండి..

'ఆల్మట్టి డ్యాం 519 మీటర్ల కంటే ఎత్తు పెంచొద్దని సుప్రీంకోర్టులో స్టే ఉంది. ఈ స్టే ఉండగానే కర్ణాటక ప్రభుత్వం కేబినేట్ తీర్మాణం చేసి, జీవో ఇచ్చి ఎత్తు పెంచడానికి భూసేకరణ కోసం ప్రొసీడింగ్స్ ఇచ్చింది. ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చాం. ఇది చట్ట వ్యతిరేకం, కేంద్ర ప్రభుత్వంగా మీరు కూడా కర్ణాటక ప్రభుత్వానికి చెప్పండని విజ్ఞప్తి చేశాం. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచితే.. తెలంగాణ అన్యాయం జరుగుతుంది. అందుకే దీన్ని మేము వ్యతిరేకిస్తున్నాం అని చెప్పాం' అని మంత్రి వివరించారు.

### ప్రాజెక్టులకు నిధులు ఇవ్వండి..

'గత 22 నెలల నుంచి కేంద్ర ఫండింగ్ ఇరిగేషన్ కోసం అడిగాం. ఇప్పటివరకు ఫండింగ్ ఇచ్చిన ప్రాజెక్టులను మీరు పూర్తి చేయండని గతంలో నేను, సీఎం రేవంత్ రెడ్డి వచ్చినప్పుడు చెప్పారు. ఆ సూచన మేరకు దేవాదుల ప్రాజెక్ట మినహా.. అన్ని ప్రాజెక్టులు పూర్తి చేశాం. అలాగే కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం మేము కొన్ని ప్రాజెక్టులను లిస్టవుట్ చేశాం. వాటికి సీడబ్ల్యూసీ నుంచి ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ ఇప్పించాలని కోరాం. ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్ట, నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్ట, సీతారామ ప్రాజెక్ట, పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, చిన్న కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, మోదికుంట వాగు ప్రాజెక్టుల కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు అడిగాం' అని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు.

'రాష్ట్ర విభజన చట్టం ప్రకారం.. కృష్ణా నది నీటిని ఎవరూ ఎక్కువ డైవర్ట్ చేయొద్దు. దుర్వినియోగం చేయొద్దు. దీనిపై కేఆర్‌ఎంబీకి అధికారం ఇచ్చారు. అయితే గత పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోలేదు. మేము వచ్చిన తర్వాత పదేపదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నేను కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి, కేఆర్‌ఎంబీకి నిధులు ఇచ్చి టెలిమెట్రీ స్టేషన్ ఇన్‌స్టాలేషన్‌లలో కొంత ప్రొగ్రెస్ తీసుకొచ్చాం. ఫేజ్-1 కింద 18 టెలిమెట్రీ స్టేషన్‌లు ఇన్‌స్టాల్ అయ్యాయి. ఫేజ్-2 కింద మరో 9 చేయాల్సి ఉంది.

ఫేజ్-3 కింద 11 టెలిమెట్రీ స్టేషన్ ఇన్‌స్టాలేషన్ చేయాల్సి ఉంది. ఫేజ్-2, ఫేజ్-3కి సంబంధించి కేఆర్‌ఎంబీకి ఆదేశాలు ఇచ్చి వేగవంతంగా పూర్తి చేయాలని కోరాం. అప్పుడు ఏ రాష్ట్రం ఎంత కృష్ణా నది నీటిని వాడుకుంటుందో స్పష్టంగా తెలుస్తుందని చెప్పాం. అంతర్రాష్ట్ర వివాదాలు తగ్గుతాయని కేంద్రమంత్రికి వివరించాం. వెంటనే స్పందించిన కేంద్రమంత్రి సీఆర్ పాటిల్.. కేఆర్‌ఎంబీకి, ఏపీ ప్రభుత్వానికి ఆదేశాలు ఇస్తామని చెప్పారు' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు.

కేంద్రమంత్రి సీఆర్ పాటిల్‌తో భేటీ అనంతరం.. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.. సీడబ్ల్యూసీ ఛైర్మన్‌తో సమావేశమయ్యారు. పెండింగ్‌లో ఉన్న తెలంగాణ ప్రాజెక్టుల గురించి చర్చించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట అత్యంత వెనుకబడ్డ జిల్లాలో ఉంది. 45 టీఎంసీల నీటిని పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు వెంటనే కేటాయించాలి. ట్రిబ్యునల్ కేటాయింపు కోసం చూడకుండా.. మైనర్ ఇరిగేషన్ కోసం 45 టీఎంసీల నీరు కేటాయించండి. సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు TAC,ITC అనుమతులు ఇవ్వాలి. తెలంగాణ-ఆంధ్రా మధ్య కృష్ణా నీటి పంపకాలు ట్రిబ్యునల్ ద్వారా త్వరగా పూర్తి చేయాలి.

గోదావరి ట్రిబ్యునల్ ప్రకారం.. గోదావరి వరద జలాలు వినియోగం సాధ్యం కాదు.. ఇదే అంశాన్ని సీడబ్ల్యూసీ ఛైర్మన్‌కి తెలిపాం. తెలంగాణ నీటి పారుదల రంగానికి ఎక్కువ నిధులు ఖర్చు చేసే రాష్ట్రం. తెలంగాణ ప్రాజెక్టులకు PMKSY కింద 2026 - 2031 వరకు ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. టెలీ మెట్రీ స్టేషన్ల ఏర్పాటుకు ఏపీ ముందుకు రాకపోతే.. మేమే పూర్తి నిధులు వెచ్చిస్తామని కేంద్రమంత్రికి తెలిపా. ఏపీ టెలిమెట్రీ స్టేషన్ల ఏర్పాటుకు నిధులు ఇవ్వడం లేదు.' అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తోపాటు.. ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ డా.శశాంక్ గోయెల్, నీటిపారుదల శాఖ అధికా రులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## సర్,ఓట్ చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరు

(మొదటి పేజీ తరువాయి)

ముసాయిదా జాబితాలో ఎలాంటి అవకతవకలు జరిగినా దానిని వెంటనే పార్టీ నేతలు సవాలు చేయాలని కాంగ్రెస్ కోరింది. మంగళవారంనాడిక్కడ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన సమావేశంలో 12 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల పార్టీ నేతలు, వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పాల్గొన్నారు.


కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం, ఎస్ఐఆర్ పూర్తి భిన్నమైన స్వభావం కలిగి ఉందని, గతంలో ఈ ప్రక్రియ చేపట్టినప్పుడు తీసుకున్న సమయంతో పోల్చుకుంటే చాలా తక్కువ వ్యవధిలో పూర్తిచేయాలనే ఆరాటమే కనిపిస్తోందని మెజారిటీ నేతలు సమావేశంలో అభిప్రాయపడ్డారు. తగినంత మంది బూత్ స్థాయి ఏజెంట్లను ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇచ్చినట్టు రాష్ట్రాల నేతలు పార్టీ అధిష్ఠానానికి వివరించారు. దీనిపై కేంద్ర నాయకులు స్పందిస్తూ, ముసాయిదా జాబితా నుంచి ఉద్దేశపూర్వకంగా ఎవరినైనా తొలగించినా, బోగస్ ఓటర్లను చేర్చినా వెంటనే అభ్యంతరాలు లేవనెత్తాలని పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశర చేసింది. బిహార్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యంతరాలను నమోదు చేయకపోవడం వల్లే ఓటర్ల జాబితా సరిగానే ఉందని, పార్టీలు ఎలాంటి అభ్యంత రాలు చెప్పలేదని ఎన్నికల కమిషన్ ప్రకటించుకున్నట్టు పేర్కొంది. బిహార్ తరహాలో కాకుండా ఈసారి ముసాయిదా జాబితాలో ఎలాంటి అవకతవకలు కనిపించినా లీగల్ టీమ్‌ల సాయంతో అభ్యంతరాలు తెలియజేయాలని, ÷నైల్ లిస్ట్ తర్వాత కూడా అప్పీల్స్ చేయాలని పార్టీ కేంద్ర నాయకులు సూచనలు చేశారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఎస్ఐఆర్ ఎక్సర్‌సైజ్‌పై మానిటర్ చేసే మెకానిజం ఉన్నా చిన్న పార్టీలకు ఆ అవకాశం లేకపోవడాన్ని ప్రశ్నించారు. ఏ ఒక్కరు ఓటు కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత ఈసీపై ఉందని, దాన్ని పార్టీల మీద నెట్టేయకూడదని అన్నారు. బీజేపీ షాడోలో ఈసీ పనిచేయరాదని, ఓట్ల చోరీకి ఎస్ఐఆర్ పక్రియను ఆయుధంగా చేసుకోరాదని ఖర్గే అన్నారు. ఈ విషయంలో పార్టీ కార్యకర్తలు, బీఎల్ఏలు, జిల్లా, సిటీ, బ్లాక్ అధ్యక్షులు అప్రమత్తంగా ఉండాలని, నిజమైన ఓటర్లను తొలగించడం, బోగస్ ఓట్లను చేర్చేందుకు చేసే ఎలాంటి ప్రయత్నం జరిగినా వెంటనే బయటపెట్టాలని సూచించారు.

## శబరిమలకు పోటెత్తిన అయ్యప్పలు

**దాదాపు రెండులక్షల మంది రాక**

**క్యూలైన్ల నిర్వహణలో బోర్డు విఫలం**

తిరువనంతపురం,నవంబర్18(వార్తా వేదిక సూర్య): మండల- మకరవిళక్కు వార్షిక తీర్థయాత్ర నేపథ్యంలో కేరళలోని శబరిమల అయ్యప్ప క్షేత్రానికి భక్తులు పోటెత్తుతున్నారు. తొలి రెండు రోజుల్లోనే దాదాపు రెండు లక్షల మందికి పైగా చేరుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. పంబ నుంచి సన్నిధానం మార్గంలోనూ విపరీతమైన రద్దీ నెలకొంది. చాలామంది బారికేడ్లను ఎక్కుతూ కనిపించారు. రద్దీ నియంత్రణ విషయంలో దేవస్థానం బోర్డు, ప్రభుత్వం వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. భక్తుల రద్దీకి సరిపడా ఏర్పాట్లు చేయలేదని ఆలయ బోర్డు ట్రస్టు, ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయి. దీంతో దర్శనం కోసం భక్తులు గంటల తరబడి నిలబడాల్సి వచ్చింది. ఆలయ ప్రాంగణం, పంబ నుంచి నడక మార్గంలో ఇసుకేస్తే రాలనంత భక్తజనం ఉండటంతో.. ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు సిబ్బంది, పోలీసులకు రద్దీ నియంత్రణ తలకు మించిన భారంగా మారింది. దర్శనం చేసుకుని వచ్చే భక్తులకు ఆ మార్గంలో ట్రాక్టర్లు, జేసీబీల రాకపోకలతో ఇబ్బందులు తప్పలేదు. పోలీస్ బందోబస్తు అంతంతమాత్రంగానే ఉందని పలువురు భక్తులు ఆరోపించారు. కొండపై వెళ్లే దారిలో గంటలు తరబడి నిలబెట్టడం, సమస్యను వినే వారు లేకపోవడం, సరైన సమాచార వ్యవస్థ లేకపోవడం వంటి వైఫల్యాలు అడుగడుగునా



ఉన్నాయి. రద్దీ నియంత్రణ కోసం నీలక్కల్, ఇతర ప్రదేశాల్లో భక్తులు ముందుకు కదలకుండా తాత్కాలికంగా ఆంక్షలు విధించారు. అయితే శబరిమలలో పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని ఏడీజీపీ శ్రీజిత్ తెలిపారు. రద్దీ నియంత్రణ వ్యవస్థ త్వరలోనే పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తుందని చెప్పారు. సరైన ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం, టీడీబీ విఫలమయ్యాయని కేరళ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ సీనియర్ నేత వీడీ సతీశన్ ఆరోపించారు.

## 6వ జాతీయ జల అవార్డులలో తెలంగాణకు అవార్డుల పంట

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. రాష్ట్రాలను ఐదు జోన్లుగా విభజించారు. ప్రతి ఒక్కరూ కనీసం 10 వేల కృత్రిమ రీఛార్జి, స్టోరేజ్ నిర్మాణాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇందులో రూఫ్‌టాప్ వాన నీటి సంరక్షణ, చెరువులు, కుంటలు, బావుల పునరుద్ధరణ కార్యక్రమాలను చేర్చారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మున్సిపల్ కార్పొరేషన్లను మూడు కేటగిరీలుగా విభజించి అవార్డులు ప్రకటించారు.

మొదటి కేటగిరీలో ఎంపికైన వాటికి రూ.2 కోట్లు, రెండో దాని కింద కోటి రూపాయలు, మూడో కేటగిరీ కింద రూ.25 లక్షల నగదు బహుమతి ప్రకటించారు. జిల్లాల విభాగంలో కేటగిరీ-1 కింద దక్షిణ జోన్ నుంచి మూడు జిల్లాలను ఎంపిక చేయగా.. ఆ మూడింటినీ తెలంగాణ రాష్ట్రం కైవసం చేసుకుంది. ఒక్కో జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున మొత్తం రూ.6 కోట్ల నగదు బహుమతి అందింది. ఆదిలాబాద్, నల్గొండ, మంచిర్యాల జిల్లాలు ఈ నగదు బహుమతిని సాధించాయి.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఏరియాలో జల సంరక్షణ చర్యలు చేపట్టినందుకు.. హైదరాబాద్ మెట్రో కార్పొరేషన్ నీటి సరఫరా, మురుగునీటి బోర్డు మున్సిపల్ కార్పొరేషన్ల విభాగంలో రెండో ర్యాంకు సాధించింది. రూ.2 కోట్ల నగదు బహుమతిని సొంతం చేసుకొంది. ఈ విభాగంలో కేటగిరీ-2లో వరంగల్, నిర్మల్, జనగామ, జిల్లాలు దక్షిణ జోన్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచి రూ.కోటి చొప్పున బహుమతి గెలుచుకున్నాయి.

కేటగిరీ-3లో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్ 1, 3 ర్యాంకుల్లో నిలిచి.. రూ.25 లక్షల చొప్పున నగదు బహుమతి సొంతం చేసుకున్నాయి. ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కుమురం భీం ఆసిఫాబాద్, మెదక్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాలకు నోడల్ అధికారిగా వ్యవహరించిన కేంద్ర జల సంఘానికి చెందిన ఎ.సతీష్‌కు కూడా అవార్డు దక్కింది.

### అవార్డులు అందుకున్న వారి వివరాలు:

డా.శ్రీజన, ఐఏఎస్, పీఆర్, ఆర్డీ కమీషనర్
కే.అశోక్ కుమార్ రెడ్డి, ఎండీ, హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై, సీవరేజ్ బోర్డ్ రాజర్షి షా, ఐఏఎస్, కలెక్టర్, ఆదిలాబాద్
జే.శ్రీనివాస్, అడిషనల్ కలెక్టర్, నల్గొండ
కుమార్ దీపక్, ఐఏఎస్, కలెక్టర్, మంచిర్యాల
డాక్టర్ సత్యశారద, ఐఏఎస్, కలెక్టర్, వరంగల్
అభిలాష అభినవ్, ఐఏఎస్, కలెక్టర్, నిర్మల్
రిజ్వాన్ భాషా షేక్, ఐఏఎస్, కలెక్టర్, జనగామ
జితేష్ వీ పాటిల్, ఐఏఎస్, భద్రాద్రి కొత్తగూడెం
బి.విజయేందిర, ఐఏఎస్, కలెక్టర్, మహబూబ్ నగర్.

## ఆత్మాహుతని సమర్థిస్తూ సంచలన వీడియో

**బయటపడ్డ డాక్టర్ ఉమర్ నబీకి చెందిన వీడియో**

న్యూఢిల్లీ,నవంబరు18(వార్తా వేదిక సూర్య): ఢిల్లీ పేలుడు కేసులో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. తాజాగా ఎర్రకోట వద్ద ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీకి చెందిన సంచలన వీడియో బయటకు వచ్చింది. పేలుడుకు ముందు అతడు సూసైడ్ బాంబింగ్ గురించి మాట్లాడాడు. అందులో అతడు ఆత్మాహుతి దాడిని సమర్థిస్తూ మాట్లాడాడు. సూసైడ్ బాంబింగ్ గురించి అందరూ తప్పుగా అర్థం చేసుకుంటారని.. వాస్తవానికి అదొక బలిదాన ఆపరేషన్‌గా అతడు అభివర్ణించారు. 'ఆత్మాహుతి బాంబు దాడికి వ్యతిరేకంగా అనేక వాదనలు ఉన్నాయి. మరణంపై ఉన్న సహజ అంచనాలకు వ్యతిరేకంగా ఓ వ్యక్తి నిర్దిష్ట సమయంలో, నిర్దిష్ట ప్రదేశంలో కచ్చితంగా చనిపోతాడని భావించడాన్ని బలిదాన ఆపరేషన్ అంటారు' అంటూ ఉమర్ ఆ వీడియోలో వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ వీడియో సంచలనం రేపుతోంది.






## బైరాగిగూడ రోడ్ సమస్యపై ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తక్షణ స్పందన

**మైలర్‌దేవ్‌పల్లి, నవంబర్ 18 (వార్త వేదిక సూర్య):** బైరాగిగూడ (సుబ్రహ్మణ్యం ఫేజ్–3) కాలనీలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించి పూర్తి చేయాలని కోరుతూ కాలనీవాసుల ప్రతినిధి బృందం మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీ ప్రతినిధుల సమస్యలను ఎమ్మెల్యే శ్రద్ధగా ఆలకించి వెంటనే సానుకూలంగా స్పందించారు. సంబంధిత రోడ్డు పనులు త్వరితగతిన పూర్తి కావడానికి బీజేఎంసీ కమిషనర్‌కు వెంటనే సూచనలు జారీ చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్యే స్పందనతో రోడ్డు సమస్య త్వరలోనే పరిష్కారం కాబోతుందనే నమ్మకంతో కాలనీవాసులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే స్పందనతో రోడ్డు సమస్య త్వరలోనే పరిష్కారం కాబోతుందనే నమ్మకంతో కాలనీవాసులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ సాగర్ గౌడ్, ఏసీఎఫ్ అధ్యక్షుడు & సామాజిక సేవకుడు వినయ్ రెడ్డి, ఏసీఎఫ్ జనరల్ సెక్రటరీ & సామాజిక సేవకుడు నరేందర్ బాబు కాలనీ అధ్యక్షుడు మహేష్ కుమార్.మాజీ అధ్యక్షుడు రమేశ్ మంద, జనరల్ సెక్రటరీ కిషోర్ విజయ్ పద్మనాబాం, అది నారాయణ ఇతర కాలనీ నివాసులు పాల్గొన్నారు.

## పోచారం మున్సిపాలిటీలో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ

**పోచారం, నవంబర్ 18 (వార్త వేదిక సూర్య):** మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించే దిశగా మంగళవారం పోచారం మున్సిపల్ కార్యాలయంలో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ నిర్వహించారు. ఇందులో భాగంగా పోచారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ కమిషనర్ నిత్యానంద ఆధ్వర్యంలో



మెప్మా సిబ్బంది ఇతర మున్సిపల్ సిబ్బంది మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వల్ల సొసైటీకి కలిగే హానికర ప్రభావాలపై అవగాహన పెంపొందిస్తూ, వాటి నిర్మూలన కోసం ప్రతి పౌరుడు బాధ్యతగా ముందుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిత్యనంద, రాజు, అశోక్ , చారీ, మెప్మా, పురపాలక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**కోరుట్ల, నవంబర్ 18 (వార్త వేదిక సూర్య):**
ప్రభుత్వ ఆదేశల మేరకు నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమములో భాగంగా కోరుట్ల పట్టణ పరిధిలోని మునిసిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ మాదకద్రవ్య రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేయించడం





జరిగింది.ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి మున్సిపల్ కమీషనర్ రవీందర్ మాట్లాడుతూ యువశక్తి అనేది సమాజం దేశం అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. అందువల్ల పెద్ద సంఖ్యలో యువత మాదకద్రవ్య రహిత భారతదేశ ప్రచారంలో పాల్గొనడం చాలా అవసరం అని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమములో మున్సిపల్ డి.ఈ సురేష్, టీ పీ ఓ ప్రవీణ్ కుమార్,మేనేజర్ శ్రీనివాస్, 200 ఎస్ హెచ్ జి మహిళలు మున్సిపల్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో పట్టణ ప్రజలు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.








# యువత రక్షణ కోసం ఐసిడిఎస్ పోరాటం

- డ్రగ్ నిర్మూలన అవగాహన కార్యక్రమం
- మత్తు వ్యసన నిర్మూలనకు విద్యాసంస్థల్లో విస్తృత ప్రచారం అవసరం

**మైలర్‌దేవ్‌పల్లి, నవంబర్ 18 (వార్త వేదిక సూర్య):** రాజేంద్రనగర్ హార్టికల్చర్ యూనివర్సిటీలో శేర్లింగంపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో 'నషా ముక్త్ భారత్ – డ్రగ్ దుర్వినియోగ నిర్మూలన కోసం సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమంను మంగళవారం ఘనంగా నిర్వహించారు. యువతలో పెరుగుతున్న మత్తు పదార్థాల అలవాటుపై అవగాహన పెంచడం, సమాజాన్ని డ్రగ్స్ ముప్పు నుండి కాపాడడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమన్నారు.ఈ కార్యక్రమంలో శేర్లింగంపల్లి ఐసిడి ఎస్ సూపర్వైజర్లు, రాజేంద్రనగర్




మండల విద్యా అధికారి శంకర్ రాథోడ్, అతాపూర్ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ ఎన్. నిరంజన్, హార్టికల్చర్ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్, పలువురు ప్రొఫెసర్లు హాజరైయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మత్తు పదార్థాలు వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ శాంతి, సమాజ అభివృద్ధిపై తీవ్రమైన ప్రభావం చూపుతున్నాయని, యువత ఈ దుష్ప్రవర్తనల నుంచి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరిలోనూ అవగాహన కల్పించడం ద్వారా మాత్రమే డ్రగ్‌ల సమస్యను నిర్మూలించగలమని పేర్కొన్నారు. విద్యా సంస్థల్లో నిరంతర అవగాహన కార్యక్రమాలు, సమన్వయంతో పనిచేస్తే మత్తు రహిత సమాజం సాధ్యమని ప్రసంగించారు. ఈ కార్యక్రమం ద్వారా హాజరైన విద్యార్థులు, సిబ్బందికి డ్రగ్ వ్యసనంపై జాగ్రత్తలు, చట్టపరమైన అంశాలపై ప్రత్యేక మార్గదర్శకాలు అందజేశారు.






# రామకృష్ణ హిల్స్-టాటా నగర్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం

### శివరాంపల్లి పిహెచ్‌సీ ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ

**మైలర్‌దేవ్‌పల్లి, నవంబర్ 18 (వార్త వేదిక సూర్య):** రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్ దేవ్పల్లి డివిజన్ పరిధిలోని రామకృష్ణ హిల్స్–టాటా మంగళవారం శివరాంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. స్థానిక నాయకులు రవీందర్ రెడ్డి హాజరైయ్యారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ "ప్రజల్లో ఆరోగ్య జాగ్రత్తలను పెంపొందించడంలో ఇలాంటి శిబి రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. ప్రతి కుటుంబం తరచూ ప్రాథమిక వైద్య పరీక్షలు చేయించుకోవాలి. చిన్న సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స చేయించుకోవడం ఆరోగ్య రక్షణకు చాలా అవసరం" అని తెలిపారు. పబ్లిక్ హెల్త్ మేనేజర్ గౌరీ మాట్లా డుతూ, "ప్రాథమిక స్థాయిలో ఆరోగ్యంపై అవగాహన పెంచడం మా ముఖ్య లక్ష్యం. ప్రభుత్వ వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. మధుమేహం, రక్తపోటు వంటి సమస్యలను ముందుగానే గుర్తించేందుకు ఈ శిబిరాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి" అని చెప్పారు. ఆర్పి కీలుగు హేమలత మాట్లాడుతూ, "మహిళలు, పిల్లలు, వృద్ధులు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి. ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల ద్వారా ప్రజల్లో చైతన్యం పెరుగుతోందని హర్షం వ్యక్తం చేస్తున్నాము" అని అన్నారు. ఈ కార్యక్రమంలో దిల్లేశ్వర్, ఆశా వర్కర్లు మంగా, లక్ష్మి, మణెమ్మ, ఏఎన్ఎం శిల్ప, ఎస్ఎఫ్ఎ సూపర్వైజర్ జైప్రకాష్, హోటల్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## కాటేదాన్ చౌరస్తాలో సిపిఎం ఆందోళన : బాధిత కుటుంబానికి న్యాయం కావాలి



**మైలర్‌దేవ్‌పల్లి, నవంబర్ 18 (వార్త వేదిక సూర్య):** కాటేదాన్ చౌరస్తాలో సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో కాలే రాజు నేతృత్వంలో రాస్తారోకో నిర్వహించారు. ఎల్లంపల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు ఎర్ర చంద్రశేఖర్ ప్రేమవివాహం నేప థ్యంలో, అతని సోదరుడు ఎర్ర రాజశేఖర్‌ను వధువు తండ్రి కావలి వెంకటేష్ సహా మరికొందరు కిడ్నాప్ చేసి హత్య చేసి, అనంతరం పెట్రోల్ పోసి తగలబెట్టిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతుడి భార్య పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ, పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం, తన కళ్లముందే దాడులు జరిగినా పోలీసులు అడ్డుకోకుండా ప్రేక్షకుల్లా నిలబడిన విషయం నాయకులు తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత 142కి పైగా



కుల దురహంకార హత్యలు చోటుచేసుకున్నా, ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమ వుతున్నా యని సిపిఎం మండల కమిటీ పేర్కొంది. నిందితులను వెంటనే అరెస్టు చేసి, హత్య కేసుతో పాటు ఎస్సీ–ఎస్టీ అట్రాసిటీ చట్టంకింద కఠినశిక్షలు విధించాలని డిమాండ్ చేసింది. అదే విధంగా, బాధిత కుటుంబానికి 50 లక్షల పరిహారం అందించి, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరింది. కుల నిర్మూలన కోసం కులాంతర వివాహాలకు ప్రభుత్వ రక్షణ తప్పనిసరని కూడా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సభ్యులు బచ్చలకూర స్వామి, చుక్క మోహన్, బానోత్ శంకర్, శ్రీను, కుమార్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# త్రో బాల్ పోటీలలో జాతీయస్థాయిలో విద్యార్థుల ఎంపిక

**మోత్కూరు, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** హైదరాబాద్ లోని మాదాపూర్ సి.జి.ఆర్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ 19 త్రో బాల్ పోటీలలో చక్కటి క్రీడా ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైన బాల, బాలికలు డి.గౌతమ్ ( కొడకండ్ల) కె.హర్షవర్ధన్ (ఇందిరా నగర్ ,మోత్కూరు). డి.వసంత(ఆలేరు) బి. త్రివేణి (బొమ్మల రామారం) ఆయా విద్యార్థులు (సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల). చదువుతున్నారని ఆలేరు నియోజకవర్గానికి చెందిన క్రీడా కారులు చక్కటి క్రీడా ప్రతిభ ను కనభరిచినట్లు ఉమ్మడి


నల్లగొండ జిల్లా త్రో బాల్ అసోసియేషన్ అధ్యక్ష ,కార్యదర్శులు ప్రతి కంఠం పూర్ణ చందర్ రాజు, మోత్కూరు యాదయ్య తెలిపారు. మంగళవారం నాడు వారు మోత్కూరులో విలేకరులతో మాట్లాడారు. ఈ క్రీడల్లో గెలు పొందిన విద్యార్థులు డిసెంబర్ నెలలో మహా రాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి ఫోటిలకు ఎంపిక య్యారని చెప్పారు. త్రో బాల్‌లో చక్కటి ప్రతిభను కనబరిచి జాతీయస్థాయి ఎంపికపట్ల స్థానిక సేక్రెడ్ హార్ట్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ మరినేని తానయ్య ఆలేరు సాంఘిక సంక్షేమ పాఠశాల ప్రిన్సిపల్ ఎం వెంకటమ్మ., మోత్కూరు, ఆలేరు పిఈటీలు . ఎం.డి. చాంద్ పాషా, శ్రీలత త్రో బాల్ అసోసియేషన్ పలువురు విద్యార్థులు అభినందించారు.

## గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

### సిపిఎం మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్

**మోత్కూరు,నవంబర్18(వార్తా వేదిక సూర్య):** గ్రామాలలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని సిపిఎం మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గ్రామాలలో నెలకొంటున్న సమస్యలపై సిపిఎం జిల్లా కమిటీ పిలుపు మేరకు మంగళవారం నాడు మండల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని రాగిబావి గ్రామంలో కుటుంబ ఆర్థిక సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి మాట్లాడుతూ రాగిబావి 6 ఏళ్ల క్రితం నూతనంగా ఏర్పాటైన గ్రామ పంచాయితీ కనీసం మౌలిక సదుపాయాకు లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో కొద్దిరోజులు నడిచిన ఆర్టీసీ బస్సు నేడు ఈ గ్రామానికి బస్సు



సౌకర్యం లేకపోవడంతో ఇక్కడున్న విద్యార్థులు, ప్రజలు విద్య వైద్య, సకాలంలో అంద లేక త్రీవ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు అదే విధంగా రాగిబావి నూతన గ్రామ పంచాయితీ లేక ప్రభుత్వ పాఠ శాలలోనే గ్రామ పంచాయతీ నిర్వహిస్తున్నా రని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు,, మండల కమిటీ సభ్యులు పసునూరి చంద్రారెడ్డి, లక్ష్మి నర్సింహ్మా స్వామి, సిపిఎం శాఖ కార్యదర్శి పానుగుల రమేష్, స్థానిక నాయకులు ఎన్నం వెంకట్ రెడ్డి, నారబోయిన వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సమస్యలపై ఈనెల 20న జరిగే ధర్నాను విజయవంతం చేయాలి

**మోత్కూరు, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న హైదరాబాద్ లోని నాంపల్లి చేనేత కమీషన్ కార్యాలయం ముందు జరిగే మహా ధర్నాను చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు గుర్రం వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు చేనేత కార్మికులకు రుణమాఫీ, ని వెంటనే అమలు చేయాలని, చేనేత కార్మిక సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా చేనేత కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా 5 లక్షల రూపాయలు రుణాలు మంజూరు చేయాలని కోరారు.

## త్రయ వాల్డర్ఫ్ ఇన్స్పైర్ స్కూల్ ప్రారంభోత్సనికి ముఖ్య అతిథిగా

# రాష్ట్ర రోడ్లు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**శంకర్‌పల్లి, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల విద్యకు సున్నితమైన సంతోషకరమైన మరియు అర్ధవంతమైన విధానంలో విద్యార్థులకు బోధన అందించాలని తెలంగాణ రాష్ట్ర రోడ్లు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండలంలో త్రయ వాల్డర్ఫ్ ఇన్స్పైర్ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రయ అనే పేరు పిల్లల చుట్టూ మూడు ముఖ్యమైన స్తంభాల కలయికను సూచిస్తుందని ఆయన తెలిపారు.

త్రయ అంటే ఉపాధ్యాయులు తల్లిదండ్రులు మరియు సమాజం, తల,గుండె, చేతులకు విద్యను అందించే త్రివిత విధానాన్ని కూడా సూచిస్తుందని ఆయన అన్నారు.

వాల్డోర్ఫ్ విద్య ప్రపంచవ్యాప్తంగా ఒక చక్రబ్దానికి పైగా అనుసరించబడిందని ఊహ స్వభావం మరియు ప్రయోజనాత్మ కంగా అనుభవాల ద్వారా పిల్లలను ప్రోత్సహిస్తుందని ఆయన తెలి పారు. ఇంత అధునాతమైన విద్యను విద్యార్థులకు అందించే విధంగా హైదరాబాదుకు దగ్గర శంకర్పల్లి ప్రాంతంలో ప్రారంభిం చడం అలాగే రవాణా సౌకర్యం కూడా చాలా బాగున్నాయి అని తెలిపారు.

లోక స్కూల్ అనేది హైదరాబాదులో ఇంత పేరుగాంచిన అందరికి తెలిసిన విషయమే అలాంటి లోకా స్కూల్ సంబంధించిన వివాహకులు యొక్క పాఠశాల నిర్వహించడం చాలా సంతోషకరం అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రోడ్లకు కూడా ఎక్కువ బడ్జెట్ కేటాయించి రోడ్లన్నీ బాగుండే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని అన్నారు.



ఇప్పటికే అవుటర్ రింగ్ రోడ్డు రీజినల్ రింగ్ రోడ్డు లకు అధిక సంఖ్యలో నిధుల కేటాయింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొని అధిక సంఖ్యలో నిధులు కేటాయించడం జరిగిందని అతి తొందరలోనే ఇక రోడ్లను కూడా పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

# గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

### విజ్ఞాన్స్ యూనివర్సిటీ అడ్వైజర్, రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ పూనం మాలకొండయ్య

**భూదాన్ పోచంపల్లి, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగరాలని విజ్ఞాన్స్ యూనివర్సిటీ అడ్వైజర్, రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ పూనం మాలకొండయ్య అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామంలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని విజ్ఞాన ధార లైబ్రరీలో మంగళవారం విద్యార్థులకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రంథాలయాలపై అవగాహన కల్పించడం, పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా పుస్తక ప్రదర్శన, వ్యాస రచన పోటీలు, క్విజ్ పోటీలు, పోస్టర్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తరచుగా గ్రంథాలయాలను సందర్శిస్తూ పుస్తక పఠనం చేయడం ద్వారా జ్ఞాన సంపదను పెంచుకోవాలన్నారు. ఇంటర్నెట్, సోషల్ మీడియా



వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ గ్రంథాలయాల ప్రాముఖ్యత తగ్గలేదన్నారు. పుస్తకాలలో లోతైన జ్ఞానం, విశ్లేషణాశక్తి, ఆలోచనా సంపత్తి అమూల్యమైందని పేర్కొన్నారు.

### ఉన్నత సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలే మార్గం:

**విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వర రావు**

సమున్నత సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలే చక్కటి మార్గాన్ని నిర్దేశిస్తాయని విజ్ఞాన్స్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వర రావు అన్నారు.

గ్రంథాలయాలున్న ప్రాంతాల్లో మనుషుల్లో అవగాహన, చైతన్యం ఎక్కువగా కనిపిస్తాయని అభిప్రాయపడ్డారు. యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా తమ జీవిత లక్ష్యాన్ని నెరవేర్చుకోవచ్చని సూచించారు. మంచి కెరీర్‌తో పాటు మంచి విలువలను పాటించాలంటే మంచి పుస్తకాలను చదవాలని విద్యార్థులకు చెప్పారు. విజ్ఞాన్ యూనివర్సిటీలోని విజ్ఞాన ధార లైబ్రరీలో వేల పుస్తకాలు ఉన్నాయని, అలాగే ఇక్కడ డిజిటల్ లైబ్రరీ కూడా అందుబాటులో ఉందని వివరించారు.

కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, డైరెక్టర్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**ఈనెల 21న సీపీఐ బహిరంగ సభ**

# సిపిఐ బస్సు జాతను విజయవంతం చేయాలి

### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ

**మోటకొండూరు,నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** ఈ నెల 21న సిపిఐ 100 వసంతాల బహిరంగ సభ సందర్భంగా ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభకు రాష్ట్ర నలుమూలల నుండి లక్షలాది మందిని తరలించుటకై సిపిఐ పార్టీ నాయకత్వంలో రాష్ట్ర స్థాయిలో మూడు బస్సు జాతా కార్యక్రమాలను సిపిఐ పార్టీ ప్రారంభించిందని అందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 19 తేదీన నారాయణపురం, చౌటుప్పల్ మండలాల మీదుగా నవంబర్ 21 తేదీన వలిగొండ, గుండాల, ఆత్మకూరు ,మోటకొండూరు చేరుకుంటుందని, అంబేద్కర్ చౌరస్తా రెడ్డిగట్టి శేషయ్య నగర్ లో జరిగే బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా సి పి ఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ మండల పార్టీ కార్యదర్శి గాదగాని మాణిక్యం లు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు వాల్ పోస్టర్ విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సిపిఐ పార్టీ నాయకత్వంలో 1925 డిసెంబర్ 26 ఆవిర్భవించిన పార్టీ వందేళ్లు పూర్తి చేసుకొని భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర పోరాటంలో బ్రిటిష్ వారి పాలన విముక్తిలో రాజీలేని పోరాటాలు, ఉద్యమాలు నడిపిన పార్టీ సిపిఐ అని అన్నారు. ఆనాడు అనేకమంది కమ్యూనిస్టు పార్టీ నాయకులపై కుట్ర కేసులు పెట్టి జైలులో నిర్బంధించినటువంటి పరిస్థితులలో కార్మిక కర్షక విద్యార్థి యువజన రైతు మహిళా తదితర ప్రజాసంఘాలను నిర్మించి ఆనాటి వెట్టి చాకిరి విముక్తి కొరకు దోపిడీ లేని వ్యవస్థ



కొరకు రాజీలేని పోరాటాలు నిర్వహించిన ఏకైక పార్టీ సిపిఐ పార్టీ అనీ కొనియాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ సర్కారు 2014లో ప్రతి కుటుంబానికి 15 లక్షల నల్లధనం ఇస్తానని రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని ధరలు తగ్గిస్తామని ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ,ప్రజాకర్షక విధానాలతో అధికారంలోకి వచ్చిన బిజెపి ఇప్పటివరకు దేశంలో ప్రజల మధ్యన మత విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ఎల్ఐసి బ్యాంకులను టెలికాం గనులను చివరికి రక్షణ రంగ పరిశ్రమలను ప్రైవేటు బడా కార్పొరేట్ శక్తులకు అప్పగించినటువంటి పరిస్థితి చూస్తున్నామని అన్నారు. దేశంలో కమ్యూనిస్టులు ఐక్యత ద్వారా వాహపక్ష ప్రజాతంత్ర శక్తుల ద్వారా సిపిఐ నిరంతర కృషి చేస్తూ దేశంలోని మతోన్మాద బిజెపి ప్రభుత్వాన్ని ఎండగట్టాలని అన్నారు . ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, కార్యవర్గ సభ్యులు బీరకాయల మల్లేశా ,బోల శ్రీనివాస్, మండల నాయకులు జీవిలికలపల్లి గణేష్, జిలకపల్లి పాండు, బీరకాయల నరసింహ ,పల్లె శ్రీనివాసు ,గొట్టిపాముల సునీల్ కుమార్ ,బీరకాయల నర్సింహా, వస్పరి శ్రీ కాంత్ , సిద్దుల కుమారస్వామి ,గడ్డం జహంగీర్, రేగు యాదయ్య, జిలకపల్లి శ్రీకాంత్ ,జిలకపల్లి వెంకటేష్, గంధమల్ల మహేశ్ ,జిలకపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# తుమ్మబావిగూడెంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి

**రామన్నపేట, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** రామన్నపేట మండల పరిధిలోని మునిపంపుల మధిర గ్రామం తుమ్మబావిగూడెంలో ఆ పరిష్కృతంగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ఇంటింటికి సమగ్ర సర్వే సందర్భంగా గ్రామ శాఖ నాయకత్వంతో నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుమ్మబావిగూడెంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేక, మంచినీటి ఆర్వో ప్లాంట్ లేక ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. ఎస్సి కమ్యూనిటీ హాల్



శిదిలావస్థకు చేరి కూలిపోయే స్థితిలో ఉంద న్నారు. వీదిలైట్లు సక్రమంగా లేక ఇబ్బంది పడుతున్నారని పంచాయతీ అధికారులు దృష్టి సాధించకపోకాడంతో అనేక సమస్యలు పేరుకు పోయాయాని వెంటనే సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ అధికారులు చొరవ చూపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు కల్లూరి నగేష్, శాఖ కార్యదర్శి అప్పం సురేందర్, సహాయ కార్యదర్శి గంటె పాక శివకుమార్, జంపాల ఉమాపతి, పావిరాల మచ్చగిరి,కట్ట అంబేద్కర్, కట్ట విజయ్, సాతిరి వెంకన్న, పావిరాల నరేష్, పట్టేటి స్వామీ దాసు, ఇస్తారీ, కుమార్,బుంగ ప్రవీణ్,అప్పం విజయ, బత్తిని సందీప్, పావిరాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం వాల్ పోస్టర్స్ ఆవిష్కరణ

**మోటకొండూరు, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** తెలంగాణ మన ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు భువనగిరి ఎల్లయ్య ఆధ్వర్యంలో మోటకొండూరు మండల కేంద్రంలో ఈనెల నెలలో 21వ తేదీన జరిగే ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం, తెలంగాణ మన ముదిరాజ్ సంఘం ఆవిర్భావ దినోత్సవం వాల్ పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మన ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు జోరుక ఎల్లేష్ ముదిరాజ్. మోట కొండూర్ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు మారబోయిన శ్రీనివాస్ ముదిరాజ్ వైస్ చైర్మన్ గిరబోయిన మల్కయ్య ముదిరాజ్. చాడ మత్స్య పారిశ్రామిక సొసైటీ అధ్యక్షులు గుర్రాల మల్లయ్య ముదిరాజ్.చాడ మత్స్య పారిశ్రామిక సహకార



సంఘం ఉపాధ్యక్షుడు గుర్రాల కిష్టయ్య ముదిరాజ్. కార్యదర్శి చొప్పరి సోములు ముదిరాజ్. పాల్గొన్నారు చాడ ముదిరాజ్ సంఘం అధ్యక్షులు దొంతి శ్రీనివాస్ ముదిరాజ్. దిలావర్పూర్ మత్స్య సొసైటీ అధ్యక్షులు సొప్పరి మారయ్య ముదిరాజ్. బరిగెల నరసింహ ముదిరాజ్. ఇట్టబోయిన నరసింహ ముదిరాజ్. తాడబోయిన శ్రీను ముదిరాజ్ .గిరబోయిన మల్కయ్య ముదిరాజ్. బరిగెల గణేష్ ముదిరాజ్ .బోల్ల శ్రీను ముదిరాజ్. మారబోయిన జాంగిర్ ముదిరాజ్. దొంతర పోయిన దేవేందర్ ముదిరాజ్. బరిగల యాదయ్య ముదిరాజ్. బరిగల వీరయ్య ముదిరాజ్ తదితర ముదిరాజ్ కుటుంబ సభ్యులు మత్స్య సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.







# వైన్ షాపులను ఊరికి దూరంగా ఏర్పాటు చేయాలి

**భూదాన్ పోచంపల్లి, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** ఇళ్ల మధ్య ఉన్న వైన్స్ షాపులను ఊరికి దూరంగా ఏర్పాటు చేయాలని కోరుతూ నేతాజీ, పద్మశాలి, కుల సంఘాల నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా ఎక్సైజ్ సూపర్డెంట్ కు వినతి పత్రం అందజేశారు. రోడ్డు ప్రధాన రహదారి జనావాసాల మధ్య స్కూల్ కు సమీపంలో వైన్సును ఏర్పాటు చేయడంతో ప్రజలు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, రోడ్డుపైన వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని అన్నారు. పర్యాటకేద్రమైన పోచంపల్లికి దేశ విదేశీయులు, జనావాసాల మధ్య ఉన్న వైన్స్ ల ను ఊరికి దూరంగా ఏర్పాటు చేయాలని కోరారు. వైన్సును దూరంగా ఏర్పాటు చేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు , నేతాజీ యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు సార బాలయ్య గౌడ్ , సంఘ ప్రధాన కార్యదర్శి శెట్టి శ్రీనివాస్ ముదిరాజ్, కోశాధికారి వంగూరి రాజు, పూల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# రామన్నపేట రైతు వేదికలో అగ్రీ లీగల్ క్లినిక్

**రామన్నపేట, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** రామన్నపేట మండల కేంద్రంలోని రైతు వేదిక నందు లీగల్ సర్వీసెస్ అధ్వర్యంలో ఆగ్రీ క్లినిక్ (వ్యవసాయ న్యాయ సహాయ సలహా కేంద్రం) ఏర్పాటు చేశారు. ఈ క్లినిక్ నందు లీగల్ సర్వీసెస్ నుండి కానుగంటి శ్రీశైలం హాజరైయ్యారు. ఇక్కడ రైతులకి కావలసిన భూ చట్టాలు, వయో



వృద్దులు సంక్షేమం, వ్యవసాయ అనుబంధ న్యాయ సలహాలు అందించడం జరుగుతుందని అన్నారు. ఏదైనా సమస్యలు ఉన్న ప్రతి మంగళవారం, శుక్రవారాలలో ఇక్కడ క్లినిక్ నందు అందుబాటులో ఉంటుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# కోటి భగవద్గీత పారాయణం

**భూదాన్ పోచంపల్లి, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** మండలంలోని హైథర్ పూర్ లో శ్రీ దత్తగిరి ఆశ్రమంలో అన్నపూర్ణ ఆధ్వర్యంలో కోటి భవద్గీత పారాయణ



కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఎస్ రూప, ఉష, రామ్ కుమార్, రుద్ర బాలమని, ఎస్. అరుణ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

**భూదాన్ పోచంపల్లి, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** మత్తు పదార్థాలకు యువత బానిసలు కావద్దని మండల తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని మండల తాసిల్దార్ కార్యాలయం , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల



ఆవరణలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేశారు ఈ సందర్భంగా డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం అందరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ నాగేశ్వరరావు, ఎంఆర్ఐ గుత్త వెంకటరెడ్డి, ఇంచార్జ్ హెడ్మాస్టర్ సిరికొండ నరసింహా రావు అధికారులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY








# మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ

**కోరుట్ల, నవంబర్ 18 (వార్త వేదిక సూర్య):** డబ్బా ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థుల చే మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం మెట్టుపల్లి రెవిన్యూ డివిజన్ పరిధిలో గల ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామం లో డబ్బా ప్రభుత్వ పాఠశాల లో ఉపాధ్యాయులు విద్యార్థుల చే మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు డ్రగ్స్ రహిత జీవన శైలి ని అనుసరిస్తూ ఎ ఒక్కరు డ్రగ్స్ బారిన పడకుండా ఉండాలని అందరికి తెలిపారు ఈ కార్యక్రమం లో డబ్బా ప్రభుత్వ ఇంచార్జి ప్రధాన ఉపాధ్యాయులు అల్లకట్టు సత్యనారాయణ ,
అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శ్రీమతి లింగంపల్లి ఉపాధ్యాయులు మండలోజు అశోక్ గారు, చిలుముల రాజేష్ , ఆడెపు నరేష్, అల్లాడి హరి ప్రసాద్, బొల్లు శంకర్, గైని జ్యోతి, వేముల మౌనిక విద్యార్థులు పాల్గొన్నారు

# బాలల దినోత్సవ వారోత్సవాలు

**ఆత్మకూరు (ఎం), నవంబర్ 18 (వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా బాలల దినోత్సవ వారోత్సవాల సందర్భంగా ఆత్మకూరు మండల కేంద్రంలో కస్తూర్బా పాఠశాలలో బాలల హక్కులు, బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన,1098,100, 112 టోల్ ఫ్రీ నెంబర్ల తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిడబ్ల్యుసి మెంబర్



కునగల మల్లేశం మాట్లాడుతూ బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని భవిష్యత్తుకు బడిలోనే పునాదులు వేసుకోవాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు . పాఠశాల ఎస్ఓ పద్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కోప్ స్వచ్ఛంద సంస్థ మండల కోఆర్డినేటర్ కురిమేటి యాదయ్య,పారా లీగల్ వాలంటీర్లు కానుగంటి శ్రీశైలం అలుగోజు విజయలక్ష్మి, ఎండి మౌలానా, డీసీపీయూ యూనిట్ సభ్యులు శ్వేత, ఉపాధ్యాయునీ సిబ్బంది రచ్చ భారతి,ఎటిఎస్వో సరిత, అంజుమారా, జవీద్ సుల్తానా ,విద్యార్థినిలు పాల్గొన్నారు.

# 22న అంబేద్కర్ యువజన సంఘం సమావేశం

**మోత్కూరు, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):**
నవంబర్ 26వ భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మోత్కూరు మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మోత్కూరు, అడ్డగూడూరు మండలాల ముఖ్య కార్యకర్తల (సన్నాహాక) సమావేశం ఈ నెల22న ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం మండల నాయకులు ఎర్రవెల్లి నర్సయ్య తెలిపారు మంగళవారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోత్కూరు, గుండాల మండలాల లో అంబేద్కర్ ఆశయాల కోసం పనిచేసే ఎస్సీలలో ఉన్న 59 ఉపకులాల యువతీ, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు చిప్పలపల్లి అవిలయ్య, జిల్లా కోఆర్డినేటర్ జేరిపోతుల ఉపేందర్ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశం అనంతరం అంబేద్కర్ యువజన సంఘం నూతన మండల కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఆయన వెంట అంబేద్కర్ యువజన సంఘం నాయకులు బాలెంల మధు, మందుల అయిలయ్య ఉన్నారు.

## మునిపంపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో

# డ్రగ్స్ నిరోధక ప్రతిజ్ఞ

**రామన్నపేట, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):**
యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని మునిపంపుల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం రోజు మాస్‌గా డ్రగ్స్ నిరోధక ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల వల్ల జీవితాలు, సంబంధాలు, ఎలా దెబ్బ తింటాయో ప్రధానోపాధ్యాయులు దొడ్డి స్వామి విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ భూతం వేషధారణలో విద్యార్థి ప్రతిజ్ఞ చెప్పడం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యారులు పాల్గొన్నారు.




డ్రగ్స్ భూత వేషధారణలో విద్యారి



# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి

**వలిగొండ, నవంబర్ 18 (వార్తా వేదిక సూర్య):**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని ముద్దాపురం క్రాస్ రోడ్ వద్ద శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి ఫంక్షన్ హాల్లో జరిగిన వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సామ సరస్వతి రాంరెడ్డి, కుమారుడు సామ సూర్య ప్రకాష్ రెడ్డి మానస వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వాకిటి అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ చిట్టెడి జనార్దన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి బెల్దే నాగేశ్వర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు మహమ్మద్ అబ్దుల్ రావుఫ్ , బండారునర్సిరెడ్డి,జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు జినుకల కృష్ణ యాదవ్, రెడ్లరేపాక మాజీ ఉపసర్పంచ్ కందుల నరేష్, ముద్దపురం మాజీ ఉపసర్పంచ్ వెంకట్ రెడ్డి, నర్సిరెడ్డి, మీసాల ముత్యాలు రాజు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# ప్రచార జాతను జయప్రదం చేయండి: సిపిఐ

**భువనగిరి, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** 1925 డిసెంబర్ 26 న ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ భారత గడ్డపై 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 20 గురువారం రోజున సాయంత్రం 5 గంటలకు భువనగిరికి సిపిఐ ప్రచార జాత వస్తుందని, ప్రచార జాతను జయప్రదం చేయాలని మంగళవారం భువనగిరి మండలంలోని బస్వాపురం గ్రామంలో కరపత్రాలు ఆవిష్కరణ చేశారు.

ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏషాల అశోక్ మాట్లాడుతూ దేశంలో నేడు నెలకొన్న పరిస్థితులలో కమ్యూనిస్టులు మరింత బలపడాలని వామపక్ష ప్రజాతంత్ర పురోగమిశక్తులు



కోరుకుంటున్నాయని ఈ నేపథ్యంలో శత వసంతాల ముగింపు సభకు ఖమ్మం నగరం వేదిక కావడం మన అందరికీ ఎంతో సంతోషదాయకమని ఈ సభకు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ నలుమూలల నుండి ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల నుండి కూడా వేలాదిగా ప్రజలు పాల్గొంటున్నారని అన్నారు.

ఈ కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దాసరి లక్ష్మయ్య, సహాయ కార్యదర్శి ఉడుత రాఘవులు, శాఖ కార్యదర్శి ముదిగొండ రాగూర్, నాయకులు చింతల పెంటయ్య, ముదిగొండ మహేష్, మరి నరసయ్య, చిక్కబాలసూరి తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న రిటైర్ ఉద్యోగ పెన్షనర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలి

**మోత్కూరు, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):**
2024 మార్చి తర్వాత ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్లకి రావాల్సిన పెండింగ్ లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు బద్దం యాదిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. మంగళవారం నాడు స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో బద్దం యాదిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్ల బకాయిల ఉన్న 5 డిఏలు, నూతన పిఆర్సీని అమలు చేయాలని , తమ రిటైర్డ్ ఉద్యోగులకు నగదు రహిత వైద్య చికిత్స పథకాన్ని త్వరగా ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో ఈనెల 25 న జరిగే రిటైర్డ్ ఉద్యోగుల జిల్లా ఎన్నికల మండల యూనిట్ పక్షాన ప్రాతినిధ్యం వహించే వారిని ఏకగ్రీవంగా ప్రతిపాదించారు. అదేవిధంగా డిసెంబర్ 17న జరగబోయే పెన్షనర్స్ దినోత్సవం జరిపే విధానం గురించి చర్చించారు. ఈ సమావేశంలో గౌరవ అధ్యక్షులు ఆకవరం వల్లభాయ్, ప్రధాన కార్యదర్శి గూడ రాజ బోస్, ఉపాధ్యక్షులు తొగిటి మనోహరాచారి, యాదగిరి లక్ష్మి, వారాల యాదగిరి, కోశాధికారి పరకాల నర్సయ్య,




సంయుక్త బయ్యని వెంకటేశ్వర్లు, ప్రచార కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ, జిల్లా ప్రతినిదులు ఎం.డి అజీముద్దీన్, అవిశెట్టి అవిలిమల్లు, కలిమెల నర్సయ్య, వీరెల్లి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



# చేప పిల్లల పంపిణీ కార్యక్రమం

**ఆత్మకూరు (ఎం), నవంబర్ 18 (వార్త వేదిక సూర్య):**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో అన్ని గ్రామాల సొసైటీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వర్యులు వాకిటి శ్రీహరి,తెలంగాణ ప్రభుత్వ విప్,శాసన సభ్యులు బీర్ల ఐలయ్య , మత్స్య పారిశ్రామిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మెట్టు సాయి కుమార్,రాష్ట కార్యదర్శి జానకిరామ్, జిల్లా మత్స్య శాఖ అధికారి రాజారావు, మత్స్య పారిశ్రామిక సంఘం మండల అధ్యక్షులు ఎద్దు వెంకటేశ్వర్ల సహకారంతో పల్లెపహాడ్, పారుపల్లి, కొరటికల్, మోరిపిరాల, రహీమ్ ఖాన్ పేట, ఖప్రాయిపల్లి, తుక్కపురం,కూరెళ్ళ,రాయిపల్లి, పల్లెర్ల సొసైటీలకు చేప పిల్లలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ సలీం, నరేష్,చరణ్, సయీద్ ,సొసైటీల అధ్యక్షు,ప్రధాన కార్య దర్శులు,సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మత్స్య పారిశ్రామిక సంఘం మండల అధ్యక్షులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వర్యులు వాకిటి శ్రీహరి,తెలంగాణ ప్రభుత్వ విప్–శాసన సభ్యులు బీర్ల ఐలయ్య, మత్స్య పారిశ్రామిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మెట్టు సాయి కుమార్,రాష్ట కార్యదర్శి జానకిరాం లకు చేప పిల్లలు పంపిణీ చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు.

## తాటి చెట్టు పైనుండి జారిపడి

# గీత కార్మికుడు తీవ్రగాయాలు

**మోత్కూరు, నవంబర్ 18 (వార్తా వేదిక సూర్య):**
మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండాపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం తాటిచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి గీత కార్మికుడు తీవ్ర గాయాల పాలైన ఘటన చోటు చేసుకుంది.

గ్రామస్తులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొండాపురం గ్రామానికి చెందిన .బీసు సదయ్య (55) అనే గీత కార్మికుడు రోజువారీగా తాటి చెట్టుపైకి కల్లు గీసేందుకు ఎక్కే క్రమంలో అకస్మాత్తుగా పట్టు అదుపు తప్పి క్రిందికి జారిపడ్డారు. .ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర గాయాలతో నేలపై పడి ఉన్న సదయ్యను గమనించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు వెంటనే స్పందించి, ఆయనను చికిత్స నిమిత్తం మోత్కూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు తక్షణ ప్రథమ చికిత్స అందించారు. అయితే, మెరుగైన వైద్యం అవసరం దృష్ట్యా, వైద్యుల సలహా మేరకు ఆయనను వెంటనే భువనగిరిలోని ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. త్రీవంగా గాయపడిన కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని గీత సొసైటీ అధ్యక్షులు బీసు సత్తయ్య, మాజీ అధ్యక్షులు బుర్ర యాదయ్య లు కోరారు.





# ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయంలోని ఉచిత వైద్య శిబిరం

**- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**

**ఎల్ బి నగర్, నవంబర్ 18(వార్త వేదిక సూర్య):**
బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ మల్లికార్జున భక్త సమాజం ఆధ్వర్యంలో శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి దేవాలయం లోని ఉచిత వైద్య శిబిరం మరియు పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి విచ్చేసి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా



సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దైవచింతన అలవరచుకోవలనిభక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించాలని వారన్నారు. అనంతరం శివ భక్తులకు నిర్వహించే అన్నదాన కార్యక్రమం ప్రారంభం చేశారు. తదుపరి ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయం చైర్మన్ ముద్ద గౌని సతీష్ కుమార్ గౌడ్‌ను అభినందించారు ఈ కార్యక్రమంలో నాయకులు అర్చకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.






## వెంకటేష్ నియామకం హర్షనీయం

### కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర నాయకులు మందుల సత్యం

**మునుగోడు, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** మునుగోడు నియోజకవర్గానికి చెందిన కుండే వెంకటేశం కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడుగా కుండే వెంకటేశం నియమిక కావడం హర్షనీయమని ఆ సమితి రాష్ట్ర నాయకులు మందుల సత్యం అన్నారు మంగళవారం కొరటికల్ గ్రామంలో ఆ సమితి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఉన్న కురుమల సమస్యను పరిష్కరించేందుకు. ఈ ప్రాంత వాసిని రాష్ట్ర బాధ్యతలు వెంకటేష్ తీసుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. కురుమలందరూ ఐక్యంగా ఉండాలని అప్పుడే ప్రతి సమస్య పరిష్కారం అవుతుందని భీమా వ్యక్తం చేశారు ఈ సమావేశంలో కురుమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతకుంట్ల మాజీ సర్పంచ్ పంది శ్రీను మృతి బాధాకరం

**దేవరకొండ, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** కొండమల్లేపల్లి మండలం లోని చింతకుంట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతకుంట్ల మాజీ సర్పంచ్ పంది శ్రీనివాస్ భౌతికాయం పై కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి నివాళు





లర్పించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పంది శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనో ధైర్యం కల్పించి మీ కుటుంబానికి ఎల్లవేళలా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. పంది శ్రీను మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని,పార్టీకి ఎన్నో సేవా కార్యక్రమాలు అందించిన వ్యక్తి నేడు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని వారి ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ ఎంఎస్సీ రాజ్ ఖాన్ కొండమల్లేపల్లి మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ శ్రీధర్ రెడ్డి రామ్ సింగ్ నాయక్ పంది సాయిలు నాగేష్ పంది వెంకటయ్య తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

### బీఎస్పీ నల్గొండ జిల్లా అధ్యక్షులుగా
## రావుల పాటి రవిశంకర్




**నల్లగొండ,నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** బీఎస్పీ నల్గొండ జిల్లా అధ్యక్షులుగా రావుల పాటి రవిశంకర్ని ప్రకటించారు. హైదరాబాద్ బీఎస్పీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు శేఖర్ చేతుల మీదగా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ..బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు బెహేన్జీ కుమారి మాయావతి నాయకత్వాన్ని బలపరుస్తూ, తెలంగాణ రాష్ట్ర ఇంఛార్జీలు,సెక్టార్ సెంట్రల్ కో-ఆర్డినేటర్ అతర్ సింగ్ రావు ఆదేశానుసారం, నల్గొండ జిల్లా ఇంచార్జీ మంచాల శ్రీకాంత్ పర్యవేక్షణలో నల్గొండ జిల్లా లో,తన వంతు బాధ్యతగా బహుజన ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోవడానికి,పార్టీనీ బలోపేతం చేయడానికీ కృషి చేస్తా అని అన్నారు.

## గీత కార్మికుల సమస్యల పరిష్కారానికై చలో హైదరాబాద్

### నవంబర్ 22 బషీర్బాగ్‌లోని ప్రెస్ క్లబ్‌లో జరుగు సదస్సును జయప్రదం చేయండి

### గీతా పనివారాల సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులు

**నల్లగొండ,నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** గీత కార్మికుల సమస్యల పరిష్కారానికై గీత పనివారల సంఘం ఆధ్వర్యంలో జరుగు సదస్సు ను జయప్రదం చేయాలని గీతా పని వారాల సంఘం జిల్లా



కార్యదర్శి బొడిగె సైదులు మంగళవారం గుండ్రంపల్లి గ్రామ గీతా కార్మికులతో కలిసి సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్, పల్లె లక్ష్మణ్ గౌడ్ ముఖ్య అతిథులు హాజరవుతున్నారని తెలిపారు.జిల్లా నలుమూల నుండి గీత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును జయప్రదం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మిద్దెల రామలింగయ్య గౌడ్, బొడిగె బక్క శెట్టి, ఉయ్యాల చంద్రయ్య, గుండ్రంపల్లి గీత సంఘం ఉపాధ్యక్షులు మారగోని యాదయ్య, గోపవుని అచ్చులు కోయగూర యాదయ్య, నమ్ముల కృష్ణయ్య , గోపగోని శెట్టి, పాలెం జంగయ్య, చెదురుపల్లి శ్రీను మొదలగు వారు పాల్గొన్నారు.

# మిల్లర్ల దోపిడీని అరికట్టాలి

### నిబంధనలు పాటించని రైస్ మిల్లులను సీజ్ చేయాలి

**నల్లగొండ,నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న రైస్ మిలర్స్‌పై చర్యలు తీసుకోవాలని, రైతులను మోసం చేసే మిల్లులను సీజ్ చేయాలని సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్, అఖిల భారత రైతు -కూలీ సంఘం (ఏ.ఐ.కె.యం.యస్) జిల్లా కార్యదర్శి అంబటి చిరంజీవి లు అన్నారు. తిప్పర్తి మండలం ఎర్రగడ్డ గూడెం గ్రామంలో ఐకేపీ సెంటర్ ను పరిశీలించారు. ఐకేపీ సెంటర్ లో కంటా వేసిన దాన్యాన్ని మిల్లర్లు రోజుల తరబడి లారీలకు ఎక్కించకుండా లారీకి 10 కింటాల దాన్యం తరుగు తెస్తేనే కొనుగోలు చేస్తామని చిట్యాల కు చెందిన రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురించేస్తున్నారని అన్నారు. రైతులు కష్టపడి పండించిన పంటను అమ్ముకోలేక రోజుల తరబడి కల్లాల వద్ద ఉంచలేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఒక వైపు తరుగు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు చెప్తున్నప్పటికి మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలు గాలికొదిలి ఇష్టానుసారం దోపిడీ చేస్తున్నారని అన్నారు. మ్యాచర్ ఉన్న దాన్యానికి కూడా బస్తాకు రెండు కేజీలు అదనంగా తీస్తున్నారని పేర్కొన్నారు. నల్లగొండ, చిట్యాల, తిప్పర్తి, మిర్యాలగూడ, మునుగోడు ప్రాంతాల్లోని మిలర్స్ అక్రమాలపై జిల్లా అధికార యంత్రాంగం స్పందించి, చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు -కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బీరెడ్డి సత్తిరెడ్డి, జిల్లా కోశాధికారి



గజ్జి రవి, నాయకులు పుట్ట సత్తయ్య, ఏనుగు సత్తిరెడ్డి, ఐ యఫ్ టీ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మిడి నగేష్, నాయకులు మామిడి ప్రవీణ్ స్థానిక రైతులు మందడి భూపాల్, నంద్యాల పెద్దులు, గడ్డమళ్ళ రాములు తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 29,30 తేదీలలో సిఐటియు జిల్లా మహాసభలు

### 29 కార్మిక ప్రదర్శన జయప్రదం చేయండి

**నల్లగొండ,నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** సీఐటీయూ నల్గొండ జిల్లా 13 వ మహాసభలు పోరాటాల పురిటి గడ్డ నల్గొండ పట్టణంలో నవంబర్ 29, 30 తేదీలలో జరుగుతున్న సందర్భంగా 29 న కార్మిక ప్రదర్శన జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎండి సలీం, తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు.మంగళవారం తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం పద్మనగర్ మార్కండేయ గుడి దగ్గర జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్యత పోరాటం నినాదంతో 1970 లో సిఐటియు ఏర్పడినప్పటి నుండి దేశంలో కార్మిక వర్గ హక్కుల కోసం అనేక పోరాటాలు చేసింది సిఐటియు అని అన్నారు కార్మికుల హక్కులే కాకుండా రైతాంగం వ్యవసాయ కార్మికులు సామాజిక సంఘాల పోరాటాలకు సిఐటియు అండగా నిలుస్తుందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సరళీకరణ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం



పోరాడుతుందని అన్నారు.

పవర్లూమ్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని పిఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పవర్లూమ్ కార్మిక హక్కుల రక్షణ కోసం పనిచేస్తున్న సిఐటియు జిల్లా మహాసభల సందర్భంగా నవంబర్ 29న నల్గొండ పట్టణంలో నిర్వహించు కార్మిక ప్రదర్శనలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షుడు గంజి నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిఐటియు పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, పట్టణ నాయకులు గంజి రాజేష్, యూనియన్ సీనియర్ నాయకులు పెండెం రాములు, కార్యదర్శి సురపల్లి భద్రయ్య, ప్రచార కార్యదర్శి పసునూరి యోగానందం, పవర్ లూమ్ మహిళా కార్మిక విభాగం అధ్యక్షురాలు మూడ చంద్రకళ, కార్యదర్శి మిర్యాల శ్రీవాణి, కోశాధికారి ఆంజనేయులు, సావిత్రమ్మ, గంజి చంద్రయ్య, కొండయ్య, ఎస్ కె జానీ, వీరయ్య మేడిపల్లి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు

# 100 ఏళ్ల పోరాట చరిత్ర సిపిఐ పార్టీది


**దేవరకొండ, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** భారత రాజ్యాంగ హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తున్న దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాల్ నరసింహ, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం లు మంగళవారం కొండమల్లెపల్లి మండలంకు చెరుకున్న సీపీఐ ప్రచార జాతలో అన్నారు.

భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరంల ముగింపు ఉత్సవాల సందర్భంగా చేపట్టిన ప్రచార జాత మంగళవారం కొండమల్లెపల్లి కి చేరుకుంది .ఈ ప్రచార జాతకు దేవరకొండ రోడ్డులో మటిల్డా పాఠశాల సమీపంలో సీపీఐ మండల నాయకులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుండి భారీ ర్యాలీతో చౌరస్తా కు చేరుకున్నారు. అనంతరం ఏం బాల్ నరసింహ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం లు మాట్లాడుతూ 100 సంవత్సరాల సీపీఐ చరిత్రలో బడుగు ,బలహీన వర్గాల కోసం ఎన్నో రాజీ లేని పోరాటాలు చేసిందని అన్నారు.ప్రజల ఎజెండానే సీపీఐ ఎజెండాగా ప్రజల పక్షాన సీపీఐ ఎల్లప్పుఫు పోరాడుతున్నదని అన్నారు.

బీజేపీ ఏ రోజు కూడా దేశం కోసం పోరాడలేదు అని,ఏ ఒక్క నాయకుడు కూడా ఒక్క రోజు జైలు కు వెళ్లలేదు కానీ,దేశభక్తి పేరుతో ఓట్లు అడుగుతారని విమర్శించారు. బిజెపి ప్రభుత్వంలో నిరుద్యోగము, రైతు ఆత్మహత్యలు పెరిగాయన్నారు.కార్మికుల హక్కుల ను నిర్వీర్యం చేసి హమాలిల,రిక్షా కార్మికులకు తిండి కూడా లేకుండ చేసిందని అన్నారు.తెల్లారేసరికి పార్టీలు మారే నాయకులున్న ప్రస్తుత రోజుల్లో సీపీఐ కార్యకర్తలు పార్టీలు మారకుండా నిరాడంబరంగా సమ సమాజస్థాపన కోసం, భూమి కోసం,భుక్తి కోసం అసమానతలు లేని సమాజం కొసం పోరాడుతున్నారని అన్నారు.సీపీఐ రాష్ట కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం




కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ ,వారి బ్యాంక్ రుణాలను మాఫీ చేస్తూ పేదవారిని నిరు పేదలుగా మారుస్తున్నదని విమర్శించారు. డిసెంబర్26 న ఖమ్మం లో లక్షలాది మంది తో జరగబోయే భారీ బహిరంగంగా సభకు సీపీఐ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శిఆర్ అంజయ్య నాయక్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు తూమ్ బుచ్చిరెడ్డి,ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు విఆంజనేయులు, జగన్, మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్ రెడ్డి,సహాయ కార్యదర్శి శేఖరాచారి, జయరాములు, సుదర్శన్ రెడ్డి, ఏఐటియూసి జిల్లా అధ్యక్షుడు రామస్వామి, కళ్ళుచరణ్ రెడ్డి,సోంల నాయక్,హమాలి కార్మికులు, వెంకటయ్య సొమ్ల సీపీఐ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు





## కురుమ యువ చైతన్య సమితి అధ్యక్షుడిగా కుండే వెంకటేష్


**గట్టుప్పల, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** ఉప్పల్ పోచమ్మ దేవాలయంలో కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో లో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశం లో అన్ని జిల్లాల నాయకులు కలిసి నూతన రాష్ట్ర కమిటీ ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా కుండే వెంకటేష్ కురుమ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా గౌరిగె నర్సింహా కురుమ గారు గౌరవ సలహాదారులుగా కౌడే పోచయ్య కురుమ గారు గౌరవ న్యాయ సలహా దారులుగా నోముల ప్రసన్న కుమార్ కురుమ గారి ఆధ్వర్యంలో నూతన రాష్ట్ర కమిటీ నియమించారు.రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొల్లు రమేష్ కురుమ గారు కొత్తూరి చంద్రమౌళి కురుమ గారు మీస సత్యనారాయణ కురుమ ఎల్లమ్మల కృష్ణ రాజు కురుమ గారు ప్రధాన కార్యదర్శి గా గౌడ రాజ్ కుమార్ కురుమ గారు కార్యనిర్వాహక అధ్యక్షులుగా కానుగంటి వెంకటేష్ కురుమ గారు కోశాధికారిగా రావుల ఐలయ్య కురుమ మందుల సైదులు కురుమ రాష్ట్ర కార్యదర్శి. బండ శ్రీకాంత్ కురుమ . కోడూరి అశోక్ కురుమ ప్రచార కార్యదర్శి . నల్గొండ జిల్లా బండారు శంకర్ కురుమ. మరియు రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఎన్నిక అనంతరం కురుమ యువ చైతన్య సమితి భవిష్యత్తు లో కులం కోసం పని చేస్తుంది అని తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడ ఎలాంటి సమస్య ఉన్న తప్పకుండ కురుమ యువ చైతన్య సమితి నిలబడుతుంది అని రాష్ట్ర నాయకులు పేర్కొన్నారు.

## యువత మాధకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

### - ఏస్ఐ సంజీవ రెడ్డి

**గట్టుప్పల, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** యువత డ్రగ్స్ మత్తు మాధకద్రవ్యాల కు దూరంగా ఉండాలని ఎస్ఐ ఎం. సంజీవ రెడ్డి అన్నారు. మాధక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాల గురించి గట్టుప్పల మండల కేంద్రం లోని విద్యాదా యిని పాఠశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. మాధకద్రవ్యాల వాడకంతో మానసిక శారీరక అనారోగ్య సమస్యలు తలెత్తి ప్రాణహాని కూడా జరిగే అవకాశ ముందన్నారు. గ్రామాల్లో ఎవరైనా డ్రగ్స్ మాధకద్రవ్యాలు వినియోగిస్తే పోలీసులకు



సమాచారం ఇవ్వాలని అన్నారు. మాదకద్రవ్యాలు రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఏ ఎస్ఐ ఆంజయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## ఈఎల్వి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వాములకు 30 వేలు అందజేత

**గట్టుప్పల, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** గట్టుప్పల మండల కేంద్రంలోని శివాలయం దేవస్థానంలో ఈ నెల 19న బుధవారంరోజున నిర్వహించే అయ్యప్ప మహాపడి పూజ కార్యక్రమనికి అయ్యప్ప స్వాముల అభ్యర్థన మేరకు ఈఎల్వి బాస్కర్ ఫౌండేషన్ డైరెక్టర్ ఇరుగుదిండ్ల అశోక్ 30 వేలను మంగళవారం అయ్యప్ప స్వాములకు అంద జేశారు. ఈ కార్యక్రమంలో స్వాములు గణేష్, రాజు, రాజేష్,నరేష్ ఈఎల్వి ఫౌండేషన్ సభ్యులు గోరిగే శంకర్, పెదగని మనోజ్, నాగరాజు,ప్రవీణ్ రెడ్డి జగన్ తదితరులు పాల్గొన్నారు.

## సాక్షి భజరంగ్‌కు సీమ ఫోటో జర్నలిస్ట్ అవార్డు

**నల్లగొండ,నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** సౌత్ ఇండియా మీడియా అసోసియేషన్ ఆధ్వర్యంలో డిసెంబర్ 6న బెంగళూరు ఎయిర్పోర్ట్ రోడ్డు లోని మాల్ ఆఫ్ ఆసియా లో నిర్వహించే సీమా ఉత్తమ ఫోటో జర్నలిస్ట్ అవార్డు 2025కు నల్లగొండ జిల్లా సాక్షి సీనియర్ ఫోటో జర్నలిస్ట్ ఎంపికైనట్లు సీమ జనరల్ సెక్రెటరీ ఎన్. కె. స్వామి తెలిపారు. మీడియా రంగంలో విశేష కృషి చేసి అనేక అవార్డులు సాధించినందుకుగాను ఈ ప్రతిష్టాత్మక అవార్డు ను కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కర్ణాటక ఆంధ్రప్రదేశ్ తెలంగాణ తమిళనాడు కేరళ పుదుచ్చేరి మంత్రులు, ఉన్నతాధికారులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.



www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

# కామ్రేడ్ చింతల భూపాల్ రెడ్డి మృతి

- పిలాయిపల్లి కాలువ సాధన కోసం 110 రోజులు రిలే నిరాహార దీక్షలో కీలక పాత్ర
- తన సొంత వ్యవసాయ బోరును గ్రామపంచాయతీకి అప్పజెప్పి ఆదర్శంగా నిలిచిన నాయకుడు
- ఆడపిల్లలకు అండగా నిలిచి సమస్యల పరిష్కారం కోసం కృషి
- ఆర్టీసీ డ్రైవర్ నుంచి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా చింతల భూపాల్ రెడ్డి
- జీవితాన్ని త్యాగం చేసి ఆదర్శంగా నిలిచిన మహనీయుడు
- విప్లవ కెరటంలా చింతల భూపాల్ రెడ్డి

చౌటుప్పల్, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య): చౌటుప్పల్ మేజర్ గ్రామ పంచాయితీ మాజీ సర్పంచ్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు చింతల భూపాల్ రెడ్డి (68) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. చిన్ననాటి నుండి అభ్యుదయ భావాలు అలవర్చుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం , నిరంతరం కృషి చేసిన నాయకుడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు కలరు. చింతల భూపాల్ రెడ్డి మృతి పట్ల పలువురు నాయకులు సందర్శించి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తూ కమ్యూనిస్టు భావాలకు ఆకర్షితుడై డివైఎఫ్ఐ లో సభ్యత్వం తీసుకొని యువజన సంఘం నాయకుడుగా ఎదిగాడు. చౌటుప్పల్ గ్రామపంచాయతీకి వార్డు మెంబర్ గా రాణించి, గ్రామపంచాయతీలో ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తూ చౌటుప్పల్ గ్రామ సర్పంచిగా ఎన్నికయ్యాడు. చౌటుప్పల్ గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేశాడు. కరువు కాటకాలతో చౌటుప్పల్ ప్రజలు ఇబ్బందులు గురవుతుంటే పంట పొలం ఎండబెట్టుకొని తన సొంత వ్యవసాయ బోరును గ్రామపంచాయతీకి అప్పజెప్పి ఆదర్శంగా నిలిచిన నాయకుడు. చౌటుప్పల్ పట్టణానికి పరిమితం కాకుండా చుట్టుపక్కల గ్రామాలకు కూడా ప్రజా సమస్యలకు దిక్సూచిలా నిలిచిన నాయకుడు. ఆడపిల్లల సమస్యల పరిష్కారం కోసం కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు పోరాటం చేసిన దీశాలి. సర్పంచిగా ఉన్న హయాంలో భారీ వర్షాలకు చౌటుప్పల్ చెరువు నిండుకుండలా మారడంతో రాత్రింబవళ్లు కష్టపడి ముంపు ప్రాంతాలను కాపాడి ప్రజలను మన్ననలను పొందారు. పిలాయిపల్లి కాల్వ సాధన కోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో 110 రోజులు రిలే నిరాహార దీక్షలో కీలకపాత్ర పోషించి ఫిలాయి పల్లి కాలువ సాధించిన ఘనత చింతల భూపాల్ రెడ్డి కే దక్కింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడిగా,మునుగోడు డివిజన్ కార్యదర్శిగా, జిల్లా విభజన తర్వాత యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడిగా అంచెలంచలుగా ఎదిగి ఆదర్శవంతమైన నాయకునిగా చౌటుప్పల్ ప్రాంత ప్రజలకు తన జీవితాన్ని, సర్వస్వం త్యాగం చేసిన మహనీయుడు కామ్రేడ్ చింతల భూపాల్ రెడ్డి. వ్యవసాయ కుటుంబంలో పుట్టి చిన్ననాటి నుండి అభ్యుదయ భావాలు అలవర్చుకొని జీవనం సాగించేందుకు ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తున్న క్రమంలో కమ్యూనిస్టు పార్టీకి ఆకర్షితుడయ్యాడు.

### రాజకీయ ప్రస్థానం:

1982, 1995లో వార్డు మెంబర్‌గా
1995లో ఎంపిటిసిగా
2001లో మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా,
2014లో ఎంపీటీసీగా పలు పదవులను చేపట్టారు.

ఆయన సతీమణి విజయలక్ష్మి ఎంపీటీసీగా ప్రజలకు సేవలు అందించారు కార్యకర్తలకు ప్రజలకు ఆపద వస్తే అండగా నిలిచారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేశారు. చౌటుప్పల్ మేజర్ గ్రామపంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. జాతీయ రహదారి విస్తరణలో అభివృద్ధి కోసం పాటుపడ్డారు. ప్రజల కోసం జీవితాన్ని త్యాగం చేసిన త్యాగమూర్తి. ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటూ సమస్య పరిష్కారానికి కృషి కృషి చేసిన ఆదర్శవంతుడు. చౌటుప్పల్ మండల ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. చౌటుప్పల్ ప్రాంత ఉద్యమ నాయకుడుగా 45 సంవత్సరాలు క్రియాశీలక పాత్ర పోషించారు. పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అందుబాటులో ఉంటూ నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారం కోసం పరితపించేవారు.

రైతు కూలీ విద్యార్థియువజన మహిళల పోరాటం చేయడంలో పార్టీ నాయకత్వాన్ని ప్రజా పోరాటాల్లో ముందుండే విధంగా ప్రోత్సహించే వారు. చింతల భూపాల్ రెడ్డి విప్లవ కెరటంలా పని చేశారు. ఆయన మృతి సిపిఎం ఉద్యమానికి ప్రజా పోరాటాలకు తీరని లోటు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉంది.


సర్పంచ్‌గా గెలుపొందినప్పుడు సిపిఎం నాయకులతో.. చింతల భూపాల్ రెడ్డి (ఫైల్ ఫోటో)


మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా గెలుపొందిన చింతల భూపాల్ రెడ్డిని సన్మానిస్తున్న సిపిఎం నాయకులు (ఫైల్ ఫోటో)


చింతల భూపాల్ రెడ్డి (ఫైల్ ఫోటో)



పిలాయిపల్లి కాలువ కోసం నిరాహార దీక్ష చేస్తున్న సిపిఎం నాయకుడు చింతల భూపాల్ రెడ్డి (ఫైల్ ఫోటో)


తమ్మినేని వీరభద్రంతో విలేకరుల సమావేశంలో ఉన్న చింతల భూపాల్ రెడ్డి (ఫైల్ ఫోటో)


సమస్యల పరిష్కారం కోసం మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని నిలదీస్తున్న సిపిఎం నాయకులు చింతల భూపాల్ రెడ్డి (ఫైల్ ఫోటో)




1984లో సిపిఎం పార్టీ నాయకులతో చింతల భూపాల్ రెడ్డి (ఫైల్ ఫోటో)

# చింతల భూపాల్ రెడ్డి ఆశయ సాధన నిజమైన నివాళులు

**- జాన్ వెస్లీ సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి**

చౌటుప్పల్, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య): అమరజీవి కామ్రేడ్ చింతల భూపాల్ రెడ్డి చౌటుప్పల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా ఎంపీటీసీగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా తన జీవితాంతం పేద ప్రజల సంక్షేమం కోసం సిపిఎం పార్టీ విస్తరణ కోసం అహర్నిశలు కృషి చేశారని అన్నారు .పార్టీ నిర్మాణంలో కందాల రంగారెడ్డి వారసత్వాన్ని అందుకొని పార్టీపై జరుగుతున్న దాడులు దౌర్జన్యాలను తిప్పుకొట్టడంలో చౌటుప్పల్ ప్రాంతంలో కీలకంగా పని చేశారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. మంగళవారం చౌటుప్పల్ మాజీ సర్పంచ్ చింతల భూపాల్ రెడ్డి మరణించడంతో ఆయన భూపాల్ రెడ్డి నివాసంలో ఆయన మృతదేహానికి పూలమాలనేసి నివాళులు అర్పించి వాళ్ళ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు అనంతరం ఆయన మాట్లాడుతూ సర్పంచ్ గా పనిచేస్తున్న సమయంలో ఉమ్మడి రాష్ట్రంలోనే చౌటుప్పల పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది ఉత్తమ సర్పంచ్ అవార్డును అందుకున్న వ్యక్తి భూపాల్ రెడ్డి అన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండడం ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహించడం ఆయన దినచర్యగా ఉండేదని అన్నారు. పార్టీలో పని చేసే యువ కార్యకర్తలను నాయకులుగా తీర్చిదిద్దడంలో వారిని ప్రోత్సహించడంలో ఆయనది ఒక ప్రత్యేకమైన స్థానమని అన్నారు .అమరజీవి కందాల రంగారెడ్డి గారి మరణాన్ని అనంతరం చౌటుప్పల్ ప్రాంతంలో పార్టీని మరింత నిర్మాణం చేయడంలో పార్టీ కార్యకర్తలకు అండగా ఉండి కాపడటంలో కీలకంగా పని చేశారని భౌతికంగా దూరం కావడం బాధాకరమని వారి యొక్క ఆశయాలను ఆదర్శాలను పాటిస్తూ ముందుకు సాగడం వారికిచ్చే ఓ ఘనమైన నివ్వాలని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు. సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య ,జిల్లా కార్యదర్శి ఎండి జాంగిర్ ,బొంతల చంద్రారెడ్డి ,కొండమడుగు నరసింహ , ఆశయ,బూర్గ కృష్ణారెడ్డి ,గంగాదేవి సైదులు, ఎండి పాషా, గోశిక కరుణాకర్, అవ్వారు రామేశ్వరి బండారు నరసింహ, బత్తుల శ్రీశైలం, చింతల దామోదర్ రెడ్డి ,దండా అరుణ్ కుమార్ ,గోపగోని లక్ష్మణ్ ,నివాళులర్పించడం జరిగింది.


చింతల భూపాల్ రెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ







## మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ చింతల భూపాల్ రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

చౌటుప్పల్ నవంబర్ 18 (వార్తా వేదిక సూర్య): చౌటుప్పల్ మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ చింతల భూపాల్ రెడ్డి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు విషయం తెలుసుకున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విద్యానగర్లోని ఆయన నివాసానికి చేరుకొని ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. భూపాల్ రెడ్డి మృతి సిపిఎం పార్టీకి తీరని లోటని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వ్యవసాయ మార్కెట్ వైస్ ప్రెసిడెంట్ ఇంద్రసేనారెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ వేణు రెడ్డి రాజు, మునుగోడు ఎన్నికల ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్ ,మాజీ జడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, నాయకులు సుర్వి నరసింహా గౌడ్, బొంగు జంగయ్య గౌడ్, బోయ దేవేందర్, మొగ్గుదాల రమేష్ గౌడ్, ఉడుగు శ్రీనివాస్ గౌడ్, బాబా షరీఫ్, బొడిగె బాలకృష్ణ, పోలోజు శ్రీనివాసాచారి, మలిగే నరసింహ తదితరులు పాల్గొన్నారు.


చింతల భూపాల్ రెడ్డి మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

# అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి



**చండూరు, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** అకాల వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. మంగళవారం చండూరు మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అకాల వర్షాలతో పత్తి పంట వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని, తేమతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని, వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి 30 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.వరి పంట వేసిన రైతులు అకాల వర్షాలకు మార్కెట్లో తడిసి ముద్దయి మొలకెత్తిన వరి ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పత్తి పంటకు ప్రస్తుత మద్దతు ధర రూ. 8810 ఉండగా, వ్యాపారులు కేవలం రూ.6 వేల నుంచి 6300 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతు పత్తి పంటను అమ్ముకుందామనుకుంటే కపాస్ కిసాన్ యాప్ లో ఎకరానికి 7 క్వింటాలు మాత్రమే బుక్ అవుతుందని, ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు వరి ధాన్యం, పత్తి పంట రైతులు తీవ్రంగా నష్టపోయారని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల ముందు ప్రజలకి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ, సిపిఎం సీనియర్ నాయకులు చిట్టి మల్ల లింగయ్య, వెంకటేశం, నరసింహ, వెంకన్న, స్వామి, తదితరులు పాల్గొన్నారు.





### మన సొంత ఇల్లు ఎంత జాగ్రత్తగా కట్టుకుంటామో.. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే

# పాఠశాలల భవనాలు కూడా అంతే శ్రద్ధగా జాగ్రత్తగా కట్టాలి

**కేజీబీవీ, మోడల్ స్కూల్స్, గురుకుల పాఠశాలలకు వెంటనే ప్రత్యేకమైన ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులకు ఫోన్లో ఆదేశం**

**నారాయణపూర్ కస్తూరిబా బాలికల పాఠశాల నూతన బిల్డింగ్ ఆధునిక వసతుల కల్పనపై**
**చౌటుప్పల్ లోని వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ, ఇంజనీరింగ్ విభాగం అధికారుల సమీక్ష నిర్వహించిన కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి**

**చౌటుప్పల్, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** తరగతి గదిలో విద్యార్థులు ఏకాగ్రతతో శ్రద్ధగా చదవాలంటే మెరుగైన సదుపాయాలు ఉండాలనే ఆలోచనతో పనిచేస్తున్న మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి తన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు.. దాంట్లో భాగంగానే మర్రిగూడ మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో 1.50 కోట్ల రూపాయల సొంత నిధులతో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించారు.. నియోజకవర్గంలోని 18 రెసిడెన్షియల్ పాఠశాలలో కూడా మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నారు.. అందులో భాగంగానే చౌటుప్పల్ లోని తన వ్యక్తిగత క్యాంప్ కార్యాలయంలో మంగళవారం నారాయణపూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా నూతన భవనాల నిర్మాణం, నూతన బాత్రూంలు టాయిలెట్స్ నిర్మాణం, డైనింగ్ హాల్స్, వంటగది, ప్రహరీ గోడ నిర్మాణం, ఆ టస్థలం ఆధునీకరణ తో పాటు విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారం కోసం విద్యాశాఖ అధికారులు ఇంజనీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు..

మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వ నుండి మంజూరై వస్తున్న నిధుల కు తోడు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ తరపున కూడా సొంత నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు.. నారాయణపూర్ కస్తూరిబా బాలికల పాఠశాల నూతన భవనాల నిర్మాణ నమూనాను గౌరవ ఎమ్మెల్యేకి చూయించారు అధికారులు.. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యార్థినుల అవసరాలకు అనుగుణంగా భవనాల నిర్మాణ నమూనాలో పలు మార్పులు చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా నూతన భవనాల నిర్మాణం చేపట్టాలని అధికారులను కాంట్రాక్టర్ ని ఆదేశించారు

ఈ చలికాలంలో విద్యార్థులు చన్నీళ్లతో స్నానాలు చేయడం చాలా కష్టంగా ఉంటుందని కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడినీటి కోసం గీజర్లు ఏర్పాటు చేస్తామని వీటి తో పాటు, ఇన్వర్టర్, డైనింగ్ హాల్, టాయిలెట్స్‌కి సహకారం అందిస్తామన్నారు...

రాత్రి సమయంలో వసతి గృహాలలో విద్యార్థులు ఇబ్బందులు పడొద్దని నారాయణపురం మండల కేంద్రంలోని కేజీబీవీ మోడల్ స్కూల్, చౌటుప్పల్ లోని కేజీబీవీ మోడల్ స్కూల్ గురుకుల పాఠశాల, చౌటుప్పల్ మండలం తూప్రాంపేటలో నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలకు విద్యుత్ సమస్య రాకుండా ప్రతి పాఠశాలకు 100 కేవీ ట్రాన్స్ఫార్మర్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని విద్యుత్ అధికారులను ఫోన్లో ఆదేశించారు...

ఈ సమీక్ష సమావేశంలో యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈవో) సత్యనారాయణ, చౌటుప్పల్ ఎంఈఓ గురువారెడ్డి, డిఈ శివ కుమార్, కాంట్రాక్టర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ : గుర్రం వెంకటేశ్వర్లు

**చౌటుప్పల్, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో మంగళవారం కీర్తిశేషులు గుర్రం రాములు లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు గుర్రం వెంకటేశం విమల దంపతులు, వారితోపాటు కుమార్తె దివ్య, మనుమరాలు అనిక తో కలిసి అయ్యప్ప మాలదారులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా అన్న ప్రసాద వితరణ దాత గుర్రం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అయ్యప్ప దీక్షాపరులకు అన్నప్రసాద వితరణ చేయడం ఎంతో తృప్తినిస్తుందని కోరిన కోరికలు నెరవేరుతున్నాయని మా కుటుంబాన్ని శ్రీ అయ్యప్ప స్వామి చల్లగా చూడాలని అయ్యప్ప భక్తుల ఆశీర్వాదం మా కుటుంబం పై ఉండాలని కోరుకుంటూ ప్రతి సంవత్సరం కూడా అయ్యప్ప భక్తులకు అన్నప్రసాద్వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలియజేశారు ఈ కార్యక్రమంలో దేవాలయ గురుస్వామి బొబ్బిళ్ళ మురళి గురుస్వామి దేవాలయ అధ్యక్షులు కామిశెట్టి భాస్కర్ శైలజా దంపతులు, తూర్పాటి శంకర్ స్వామి, ముగుదాల రమేష్ గౌడ్ ,హనుమాన్ నగర్ కాలనీ వాసులు భీమిడి మోహన్ రెడ్డి, కాసోజు గోవర్ధన్ చారి, కాసోజు లింగాచారి, కంచర కుంట్ల వెంకటరెడ్డి గురుస్వామి,ఉప్పు ఆంజనేయులు గురు స్వామి తిరందాసు జగన్నాథ్ గురు స్వామి, దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, కామిశెట్టి చంద్రశేఖర్ గుప్త, వర్కాల రవి గౌడ్, సుక్కా సుదర్శన్ స్వామి, శశి స్వామి, కారంటోతు బిక్ష నాయక్ గురు స్వామి, కొండమడుగు శ్రవణ్ స్వామి, గొడుగు శ్రీనివాస్ గురు స్వామి, సాంబ స్వామి, వేణు స్వామి స్థానిక పోలీస్ కానిస్టేబుల్స్ సతీష్ స్వామి నరేష్ స్వామి, కాసోజు లింగాచారి, ఓర్సు రాజు తదితరులు పాల్గొన్నారు..







# విప్లవ కెరటం చింతల భూపాల్ రెడ్డి

- చింతల భూపాల్ రెడ్డి మరణం సిపిఎం ఉద్యమానికి, ప్రజా పోరాటాలకు తీరనిలోటు
- భూపాల్ రెడ్డి మరణానికి సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటి సంతాపం
- ఎండి జహంగీర్ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి



**చౌటుప్పల్, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** చౌటుప్పల్ మండల ఉద్యమ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన చింతల భూపాల్ రెడ్డి మరణం సిపిఎం ఉద్యమానికి ప్రజా పోరాటాలకు తీరనిలోటు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. మంగళవారం ఆయన చింతల భూపాల్ రెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు అనంతరం ఆయన మాట్లాడుతూ...చింతల భూపాల్ రెడ్డి మరణానికి సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటి సంతాపాన్ని ప్రకటిస్తూ

భూపాల్ రెడ్డి యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా, మునుగోడు డివిజన్ కార్యదర్శిగా చౌటుప్పల్ ప్రాంత ఉద్యమ నాయకుడిగా 45సం. క్రియాశీలక పాత్ర పోషించిగ్రామ పంచాయతీ సర్పంచ్ గా ప్రజల మన్ననలు పొంది గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపారు. అనేకమంది యువతకు ఆదర్శంగా నిలుస్తూ, పార్టీ క్యాడర్ కు అందుబాటులో ఉంటూ నిరంతరం ప్రజల సమస్యల కోసం పరితపించే నాయకుడు అని, పార్టీ ఎదుగుదలకు నాయకత్వానికి ఎప్పటికప్పుడు పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో భూపాల్ రెడ్డి పాత్ర కీలకం అని అన్నారు. మునుగోడు డివిజన్ కార్యదర్శిగా డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో గ్రామాల్లో పార్టీని నిర్మించడంలో తన పాత్ర కీలకం అని, వారి సేవలు మర్వలేము అని వారు అన్నారు. అదేవిధంగా జిల్లా సిపిఎం ఉద్యమం ముందుకు సాగడం కోసం అనేక రకాల కృషి చేశారని వారు అన్నారు. రైతు, కూలీ, విద్యార్థి, యువజన, మహిళ పోరాటాలు చేయడంలో పార్టీ నాయకత్వాన్ని ప్రజా పోరాటాల్లో ముందుడే విధంగా ప్రోత్సహించడంలో ముందుంటారు అని వారు అన్నారు. వారి ఆశయాల సాధన కోసం పార్టీ నాయకత్వం ముందుండాలని వారు అన్నారు. వారి మరణం సిపిఎం ఉద్యమానికి ప్రజా పోరాటాలకు తీరనిలోటు అని వారు అన్నారు వారి మరణానికి సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటి సంతాపం ప్రకటిస్తుంది అని వారు తెలిపారు తెలిపారు.

### బూటకపు ఎన్‌కౌంటర్లతో

# మానవ హననం

## కేంద్రానివి జంగిల్‌రాజ్ విధానాలు: కూనంనేని

**హైదరాబాద్,నవంబర్18(వార్తా వేదిక సూర్య):** మావోయిస్టులను చంపుకుంటూ పోవడమంటే మానవ హననం తప్ప మరొకటి కాదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు జంగిల్ రాజ్ పరిపాలనకు పరాకాష్ట అని పేర్కొన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల పోలీసులు కూడా ఇందులో పావులుగా మారారని ఆయన మండిపడ్డారు. ఈ రోజు మారేడుమిల్లిలో జరిగిన హిడ్మా ఎన్‌కౌంటర్, అంతకుముందు మావోయిస్టులపై జరిగిన ఎన్‌కౌంటర్స్ మొత్తం ఫేక్ అని కూనంనేని అన్నారు.బూటకపు ఎన్ కౌంటర్స్‌తో మనుషులను చంపుకునే వ్యవస్థ ప్రపంచంలో ఎక్కడా లేదని కూనంనేని సాంబశివ రావు ÷ర్ అయ్యారు. మావోయిస్టులు ఏదైనా నేరాలు చేసివుంటే వారిని అరెస్టు చేసి, చట్టభద్దంగా విచారణ జరిపించాలే తప్ప ఇలాంటి ఫేక్ ఎన్‌కౌంటర్‌లు చేయడం విచారణకరమన్నారు. మావోయిస్టులపై జరుగుతున్న ఎన్‌కౌంటర్లపై విచారణ జరిపించాలని కూనంనేని సాంబశివ రావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.






# రోడ్డు నిర్మాణ పనుల పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి

**చౌటుప్పల్, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** చౌటుప్పల్ మున్సిపాలిటీ కమిషనర్ జి వెంకట్రాంరెడ్డి పట్టణ అభివృద్ధిలో భాగంగా మూడవ వార్డు లింగోజిగూడెం ఎస్సీ కాలనీ నుండి హైవే రోడ్డు వరకు దివిస్ పారిశ్రామిక యాజమాన్యం సహకారం సి ఎస్ ఆర్ నిధులతో నిర్మించ తలపెట్టిన రోడ్డు నిర్మాణ పనులకు క్షేత్రస్థాయిలో మంగళవారం ఆయన పర్యవేక్షిస్తూ , సాంకేతికపరమైన సమస్యలను ఇంజనీరింగ్ విభాగము ఏఈ నితీష్ కుమార్ తో చర్చిస్తూ, దివిస్ యాజమాన్యం వారికి తగు సూచనతో ఆదేశాలను జారీ చేశారు. ఈ కార్యక్రమంలో దివిస్ పారిశ్రామిక సంస్థ ప్రతినిధి గోపి, పర్యావరణ ఇంజనీర్ రేణు కుమార్, వార్డు ఆఫీసర్ రాజు, వర్క్ ఇన్స్పెక్టర్లు సునీల్ ,సంతోష్, బిల్ కలెక్టర్ శ్యాము తదితరులు పాల్గొన్నారు.

# పగిడిమర్రి ప్రభావతి మృతి బాధాకరం

**- కేతావత్ భీల్యా నాయక్**

**దేవరకొండ, నవంబర్ 18(వార్తా వేదిక సూర్య):** దేవరకొండ పట్టణానికి చెందిన ఏఎంసి డైరెక్టర్ పగిడిమర్రి రఘు రాములు యొక్క తల్లి గారు మృతి చెందిన సంఘటన తెలుసుకొని వారి స్వగృహానికి వచ్చి భౌతిక కాయానికి పూలమాల వేసి, నివాళులు అర్పించి, వారి యొక్క కుటుంబ సభ్యులను పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్ ఈ సందర్భంగా వారి యొక్క కుటుంబ సభ్యులను పరామర్శించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని అన్నారు.



ఈ కార్యక్రమంలో చిలువేరు కాశినాద్, నక్క వెంకటేష్, గాజుల రాజేష్, చంద్ర మౌళి, గోవర్దన్, బాలనాదం, హరి నాయక్ తది తరులు పాల్గొన్నారు.

# ఐబొమ్మ రవిని ఎన్‌కౌంటర్ చేయాలి

## నిర్మాత సి.కళ్యాణ్ సంచనల వ్యాఖ్య

**హైదరాబాద్,నవంబర్18(వార్తా వేదిక సూర్య):** మూవీ పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ నిర్వాహకుడు రవిని ఎన్ కౌంటర్ చేయాలని ప్రముఖ నిర్మాత సీ. కళ్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం తెలుగు ఫిలిం ఛాంబర్ మీడియా సమావేశం నిర్వహించింది. మూవీ పైరసీకి పాల్పడుతోన్న ఐబొమ్మ రవిని అరెస్ట్ చేసినందుకు ప్రభుత్వానికి థ్యాంక్స్ చెప్పారు ఫిల్మ్ ఛాంబర్ ప్రతినిధులు. అనంతరం ఛాంబర్ ప్రతినిధులు మూవీ పైరసీపై మాట్లాడారు. ఈ సందర్భంగా నిర్మాత సీ. కళ్యాణ్ మాట్లాడుతూ.. కోట్లు పెట్టి సినిమా తీస్తే పైరసీ చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పైరసీతో మూవీ ఇండస్ట్రీకి వేల కోట్ల నష్టం వాటిల్లేలా చేసిన రవిని అరెస్ట్ చేసిన ప్రభుత్వానికి, పోలీస్ డిపాటంమెంట్ కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. పోలీస్ డిపాటంమెంట్‌ను సినీ ఇండస్టీ తరుఫున త్వరలో సన్మానిస్తామని చెప్పారు. నిర్మాత చదలవాడ శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలోనే అత్యుత్తమంగా తెలంగాణ పోలీస్ వ్యవస్థ పనిచేస్తుందని ప్రశంసించారు. ఐబొమ్మ సైట్ నిర్వాహకుడు రవిని అరెస్ట్ చేసేందుకు పోలీసులు చాలా కష్ట పడ్డారని కొనియాడారు. బడ్జె పెంచి సినిమా టికెట్ రేట్లు భారీగా పెంచుతు న్నారని.. ఇది తప్పన్నారు. బ్జడెట్‌లో 90 శాతం ఆర్టిస్టులకి ఇస్తున్నారని.. ఆ భారం ప్రేక్షకుల మీద పడుతుందని అన్నారు. చిత్ర పరిశ్రమకు పెను సవాలుగా మారిన 'ఐబొమ్మ' పైరసీ వెబ్‌సైట్ కింగ్‌పిన్ ఇమ్మడి రవి అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. దమ్ముంటే నన్ను పట్టుకోండి అంటూ పోలీసులకే సవాల్ విసిరిన రవిని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. విదేశాల నుంచి హైదరాబాద్ వచ్చిన రవిని కూకట్‌పల్లిలో అదుపులోకి తీసుకుని కటకటాల్లోకి నెట్టారు.

# ఐబొమ్మ కేసులో ఈడీ ఆరా

## హైదరాబాద్ సీపీకి ఈడీ లేఖ

**హైదరాబాద్,నవంబర్18(వార్తా వేదిక సూర్య):** 'ఐ బొమ్మ' కేసులోకి ఈడీ రంగంలోకి దిగింది. దీనికి సంబంధించి హైదరాబాద్ సీపీకి ఈడీ లేఖ రాసింది. ఐ బొమ్మ కేసులో మనీ లాండరింగ్ జరిగినట్టు ఈడీ అనుమానం వ్యక్తం చేస్తోంది. ఈ కేసుకి సంబంధించిన వివరాలు ఇవ్వాలని ఈడీ రాసిన లేఖలో పేర్కొంది. ఇప్పటికే ఐ బొమ్మ యజమాని ఇమ్మడి రవి, అలియాస్ ఐబొమ్మ రవి బ్యాంక్ ఖాతా నుంచి రూ.3.5 కోట్లు ఫ్రీజ్ చేసిన పోలీసులు.. విదేశీ బ్యాంక్ అకౌంట్ల నుంచి పెద్దమొత్తంలో రవి ఖాతాకు నిధులు బదిలీ అయినట్టు భావిస్తున్నారు. నెలకు రూ.15లక్షలు క్రిప్టో వాలెట్ నుంచి రవి ఖాతాకు బదిలీ అయినట్టు తెలుస్తోంది. వీటిపై ఈడీ దర్యాప్తు చేయనుంది. మరోవైపు.. ఈ కేసుకి సంబంధించిన రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఐ బొమ్మ రవి నేరాన్ని అంగీకరించినట్లు రిమాండ్ రిపోర్టులో పోలీసులు పేర్కొన్నారు. ఐ బొమ్మ, బప్పం టీవీ పేరు మీద 17 వెబ్సైట్లు నిర్వహించినట్లు గుర్తింపు. క్రిప్టో కరెన్సీ వాలెట్ నుంచి రవి ఎన్నారై ఖాతాలకు నగదు బదిలీ చేశాడు. ఐబొమ్మ రవిని పట్టించిన రెండు డొమైన్లు ఒక డొమైన్ అమెరికాలో.. మరొక డొమైన్ అమీర్‌పేట్‌లో రిజిస్టర్ చేసిన రవి. విదేశీ పౌరసత్వం తీసుకున్న ఐ బొమ్మ రవి. దేశ డిజిటల్ భద్రతకు రవి ప్రమాదకరం అని పోలీసులు తెలిపారు.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS,** H.No.132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252., and Published at H.No. 132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI No: TGTEL/25/A0305,** Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya2025@gmail.com**